ఆదివారం
12-06-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 70, సంచిక : 349
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికా వెళ్లాలా.. కోవిడ్ నెగటివ్ అక్కర్లేదు



అమెరికాకు వెళ్లాలంటే ఒక రోజు ముందుర కోవిడ్ పరీక్ష చేయించుకొని నెగటివ్ వస్తేనే ప్రయాణించే అవకాశం ఉండేది. కానీ ఇప్పటి నుంచి ఆ పరిస్థితి ఉండదు. అంతర్జాతీయ ప్రయాణికులకు కోవిడ్ నెగటివ్ రిపోర్టు తప్పనిసరి కాదని బైడెన్ ప్రభుత్వం పేర్కొంది.

2 లో

తగ్గాల్సిందే...

- ఆచితూచి ఖర్చు చేస్తున్న ప్రజలు
- 18 శాతం తగ్గిన వినియోగదారుల వ్యయం
- ద్రవ్యోల్బణ ఘాతం... ధరాభారమే కారణం
- దెబ్బతీసిన పాలకుల అస్తవ్యస్త ఆర్థిక విధానాలు
- విలాసాలు, వినోదాలకు దూరం

న్యూఢిల్లీ : దేశ ప్రజలు తమ వ్యయం విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. కోవిడ్-19 మహమ్మారి ప్రారంభమైన నాటి నుంచి తీవ్ర అనారోగ్య, ఆర్థిక ఉత్పాతానికి గురై, బతుకులు ఛిద్రమై, జీవనం భారంగా సాగిస్తున్న పరిస్థితులు అడుగడుగునా గోచరిస్తున్నాయి. పాలకుల అస్తవ్యస్త ఆర్థిక విధానాలు తమపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపడం, ద్రవ్యోల్బణం పెరుగుదలతో ఆహార, తయారీ ఉత్పత్తుల ధరలు ఆకాశాన్నంటడం వంటివి దేశీయ వినియోగదారులను బిక్కుబిక్కుమంటూ ఖర్చు చేసే పరిస్థితికి తీసుకువచ్చాయి. రెండు సంవత్సరాల క్రితం కోవిడ్-19 మహమ్మారి భారతదేశాన్ని తాకింది. మనకు తెలిసినట్లుగా జీవితాన్ని మార్చింది. లాక్‌డౌన్‌లు జీవనోపాధిని తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఆర్థిక వ్యవస్థను నాశనం చేశాయి. చాలా మంది తమ ఇళ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. సాంకేతికంగా ఆర్థిక వ్యవస్థను నడిపించే కోట్లాది మంది దేశ ప్రజల వ్యయ ధోరణిపై మహమ్మారి ప్రభావం ఎలా ఉంది? వివరాల్లోకి వెళితే... 2020-21 ఆర్థిక సంవత్సరంలో వినియోగానికి సంబంధించి గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) విడుదల చేసిన తాజా వివరాల ప్రకారం, భారతీయులు రెస్టారెంట్లు, హోటళ్లు, మద్యం, పొగాకు, దుస్తులపై తక్కువ ఖర్చు చేశారు. కానీ ఆహారం, ముఖ్యంగా మాంసం, గుడ్లు, సముద్రపు ఆహార ఉత్పత్తులపై ఎక్కువ ఖర్చు చేశారు. వారు శీతల పానీయాలు, రసాలను తగ్గించినప్పటికీ వారి ఉదయం కప్పు టీ లేదా కాఫీని తగ్గించలేదని స్పష్టమయింది. స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) సంఖ్యలు ఒక దేశంలోని మొత్తం ఆర్థిక కార్యకలాపాల గురించి వివరిస్తాయి. అయితే ప్రైవేట్ తుది వినియోగ

- మిగతా 2 లో

వైసీపీ ఓట్లే కీలకం

ఏపీకి అందివచ్చిన రాష్ట్రపతి ఎన్నిక

- హోదాపై జగన్ నిలదీస్తారా?
- విభజన హామీలపై కేంద్రం మౌనం
- టీడీపీ తీరూ అంతే

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే రాష్ట్రపతి ఎన్నికల్లో వైసీపీ మద్దతు బీజేపీకి అత్యవసరం. ఈ అస్త్రంతో ఈసారైనా రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రధాని మోదీని సీఎం జగన్ నిలదీస్తారా? రెండోసారి బేషరతుగా మద్దతిస్తారా? అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రాబోయే రాష్ట్రపతి ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా జగన్ వెళ్లాలనీ, రాష్ట్రపతి ఎన్నికలకూ ప్రత్యేక హోదా తదితర హామీలపై కేంద్రంపై ఒత్తిడి పెంచాల్సిందేనంటూ విపక్షాలు డిమాండు చేస్తున్నాయి. వైసీపీ మాత్రం మౌనంగా ఉంది. కేంద్ర, రాష్ట్రాల్లో వైసీపీ, బీజేపీల రాజకీయం విభిన్నంగా ఉంది. ఏపీలో బీజేపీ, వైసీపీ నేతలు పరస్పరం ఘాటుగా విమర్శించుకుంటున్నారు. ఢిల్లీ కేంద్రంగా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతుంటారు. సీఎం జగన్ ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర నేతలతోపాటు ఆ పార్టీ జాతీయ నాయకులు రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు గట్టి విమర్శలు చేసి, జగన్ ప్రభుత్వాన్ని ఎండగడుతున్నారు. కేంద్రంలోని మోదీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక, ఏపీకి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలు ఇతరత్రా అమలు చేయలేదు. పోలవరం పెండింగ్ నిధులు, పునరావాస ప్యాకేజీ నిధులు ఇవ్వలేదు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకరించడం లేదు. దీనిపై గట్టిగా నిలదీయాల్సిన వైసీపీ మౌనంగా ఉండిపోతోంది. అందివచ్చిన రాష్ట్రపతి ఎన్నికల అవకాశాన్ని సైతం రాష్ట్ర ప్రయోజనాల కోసం వినియోగించుకోలేకపోతోంది.

మెలిక పెడతారా?

తాజాగా రాష్ట్రపతి ఎన్నికలు రావడంతో మళ్లీ వైసీపీ విధానంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈసారైనా రాష్ట్ర ప్రయోజనాలపై మోదీని జగన్ గట్టిగా నిలదీస్తారా? స్వప్రయోజనాల కోసం మెత్తపడతారా? అనేది తేలాల్సి ఉంది. మోదీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. పెట్రో ఉత్పత్తుల ధరలు మండిపోతున్నాయి. వాటి తగ్గింపుపై వైసీపీ నుంచి ఇంతవరకూ కేంద్రాన్ని డిమాండు చేయలేదు. ఇవన్నీ వదిలేసి, మోదీపైన, కేంద్రంపైన ఎలాంటి డిమాండ్లు పెట్టకుండా, రెండోసారి సైతం బీజేపీ నిలిపిన అభ్యర్థికే వంతపాడితే, రాష్ట్ర ప్రజల మనోభావాలు దెబ్బతింటాయనే వాదనలున్నాయి. పక్క రాష్ట్రమైన తెలంగాణ సీఎం కేసీఆర్ తరహాగా ఒంటరిగా ఆలోచించే విధానం, జగన్‌కు

- మిగతా 2 లో

అరెస్టుల పర్వం

- యూపీలో 227 మంది నిర్బంధం
- పోలీసుల అత్యుత్సాహం - విచ్చలవిడిగా కేసులు
- యూపీలో బుల్డోజర్ హెచ్చరికలు
- పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న నిరసనలు, హౌరాలో హింస
- పోలీసుల గుప్పెట్లో రాంచీ

న్యూఢిల్లీ : ప్రవక్త మహమ్మద్‌పై బీజేపీ నేతల అనుచిత వ్యాఖ్యలపై నిరసన కొనసాగుతోంది. ఇదే క్రమంలో శుక్రవారం దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలను ముస్లింలు చేపట్టారు. తప్పును ఖండించే వారికే సంకెళ్లు వేసే ప్రయత్నాలు మోదీ పాలనలో సాగుతున్నాయి. ముస్లింలను రెచ్చగొట్టడమే కాకుండా వారి నుంచి వచ్చే ప్రతిస్పందనను భూతద్దంలో పెట్టి చూపించే ప్రయత్నాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలు చేస్తున్నాయి. శాంతియుతంగా సాగిన నిరసనలను సైతం హింసాత్మకంగా చూపుతున్నాయి. దీంతో దేశవ్యాప్తంగా అరెస్టుల పర్వం మొదలైంది. శుక్రవారం దేశవ్యాప్త ప్రదర్శనల సందర్భంగా అనేక రాష్ట్రాల్లో నిరసనలు చేలరేగాయి. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో నిరసనకారులు, పోలీసుల మధ్య హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందినట్లు అధికారులు శనివారం వెల్లడించారు. పశ్చిమ బెంగాల్‌లో హౌరా జిల్లాలో శనివారం కూడా ఘర్షణలు జరిగాయి. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈనెల 3న చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు కారణమైన ప్రధాన నిందితుడు జాఫర్ హయత్ హష్మీ సన్నిహితుడు మహమ్మద్ ఇస్తియాఖ్‌కు చెందిన భవనాన్ని అధికారులు కూల్చి వేశారు.

శనివారం ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 227 మంది ముస్లింలను అరెస్టు చేశారు. వీరిలో 68 మంది ప్రయాగ్‌రాజ్‌లో, 50 మంది హత్రాస్‌లో 48 మంది, సహరన్‌పూర్‌లో, 28 మంది అంబేద్కర్‌నగర్, 25 మందిని మోరాదాబాద్‌లో, ఎనిమిది మందిని ఫిరోజాబాద్‌లో అరెస్టు చేసినట్లు అదనపు డీజీపీ ప్రశాంత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం ప్రయాగ్‌రాజ్, సహరన్‌పూర్‌లో నిరసనల క్రమంలో పోలీసులపై ఆందోళనకారులు రాళ్లు రువ్వారని, ప్రయాగ్‌రాజ్‌లో పోలీసు వాహనంతో పాటు బైకులకు నిప్పుపెట్టారని, ఆందోళనకారులను చెదరగొట్టేందుకు బాష్పవాయువు, లాఠీలను ప్రయోగించినట్లు తెలిపారు. సహరన్‌పూర్‌లో బీజేపీ నేత నుపుర్‌శర్మకు వ్యతిరేకంగా నినాదాలు మిన్నంటాయి. వేల్ఫేర్ పార్టీ నేత జావేద్ మహమ్మద్, ఆయన భార్య పర్వీన్, కుమార్తె సుమయ్యను శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. మహమ్మద్ రెండవ కుమార్తె, కార్యకర్త ఆఫ్రీన్

- మిగతా 2 లో

రాష్ట్రపతి ఎన్నిక...

ప్రతిపక్ష నేతలకు మమత లేఖ

15న విపక్ష సీఎంలు, నేతలతో భేటీ

కోల్‌కతా : రాబోయే రాష్ట్రపతి ఎన్నిక కోసం ఉమ్మడి వ్యూహం సిద్ధం చేసేందుకు 15న ఢిల్లీలో ఏర్పాటు చేస్తున్న సమావేశానికి హాజరుకావలసిందిగా విపక్ష సీఎంలు, నేతలకు శనివారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లేఖ రాశారు.

'జూన్ 15న మధ్యాహ్నం 3 గంటలకు న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో రాష్ట్రపతి ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ కార్యాచరణపై చర్చించాలని మా చైర్‌పర్సన్ మమతా బెనర్జీ అన్ని ప్రగతిశీల ప్రతిపక్ష శక్తులకు పిలుపునిచ్చారు' అని బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తెలిపింది. రాష్ట్రపతి ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దేశ రాజధానిలో సంయుక్త సమావేశంలో పాల్గొనవలసిందిగా ప్రతిపక్ష సీఎంలు, నాయకులను బెనర్జీ సంప్రదించారని పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఈతకు వెళ్లి నలుగురు

చిన్నారుల దుర్మరణం

విశాలాంధ్ర-జరుగుమల్లి: ప్రకాశం జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. చెరువులో స్నానానికి దిగి నలుగురు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటన జరుగుమిల్లి మండలం అక్కచెరువు పాలెంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. మొత్తం ఆరుగురు పిల్లలు చెరువులో గల్లంతయ్యారు. వారిలో ఇద్దరు బాలికలను స్థానికులు కాపాడి ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మిగతా నలుగురి మృతదేహాలను చెరువులో నుంచి వెలికి తీశారు. మృతులు కౌశిక్ (16), సుభాశ్ (11), సుబ్రహ్మణ్యం (15), హరి భగవన్నారాయణ (10)గా గుర్తించారు. ఒకే గ్రామంలో నలుగురు మృతి చెందడంతో అక్కచెరువుపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాధిత కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి పరామర్శించారు.

పది ఫెయిల్ విద్యార్థులకు తరగతులు

అడ్వాన్స్ సప్లిమెంటరీకి సన్నద్ధం

పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

పది పరీక్షల్లో ఫెయిల్ అయిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఈనెల 13 నుంచి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 71 పాఠశాలల్లో ఒక్క విద్యార్థీ పరీక్ష పాస్ కాలేదు. సున్నా ఫలితాలు వచ్చిన పాఠశాలల్లో 40 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.

3 లో

ఇదీ లోకం!

నేను పది తప్పాను, నన్ను బాలకార్మికురాలిగా మారకుండా చూడండి!

హైవే నిర్మాణం...

అరణ్యారోదన

అభివృద్ధి ముసుగులో పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

విశాలాంధ్ర-అరకులోయ: ప్రకృతిలో సహజ అందాలతో ప్రతి ఒక్కరిని కనువిందు చేసే మన్యం అరణ్యం నేడు రోదిస్తోంది. ఎత్తయిన కొండలు, గల గల పారే జలపాతాలు, పొడవైన చెట్లు, ప్రకృతి సహజ సిద్ధంగా వెలిసే అద్భుత అందాలతో ప్రతి ఒక్కరిని మంత్రముగ్ధులను చేసే పాడేరు మన్యం కాలక్రమేణ తన పూర్వవైభవాన్ని కోల్పోయి అంద విహీనంగా మారుతోంది. ఓ పక్క కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షించండి, మొక్కలు నాటండి, చెట్లు పెంచండి అంటూ ఎప్పటికప్పుడు ప్రకటనలు గుప్పిస్తున్నా, అభివృద్ధి ముసుగులో పచ్చని చెట్ల పై గొడ్డలి వేటు వేసి పర్యావరణాన్ని నాశనం చేయడం ఎంతవరకు సమంజసమని ఈ ప్రాంత ప్రజలతో పాటు పర్యాటకులు ప్రశ్నిస్తున్నారు. వన మహోత్సవం నాడు లక్షలాది మొక్కలు నాటుతారు. అదే ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో వేలాది చెట్లను నరుకుతారా అని పర్యాటక ప్రేమికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మానవాళి మనుగడకు పర్యావరణమే ప్రధానమని మేధావులు, వాతావరణ నిపుణులు చెబుతున్న మాట. అయితే ప్రభుత్వాలు కూడా బహిరంగంగా మేధావుల అభిప్రాయానికి మద్దతు పలుకుతున్నప్పటికీ పరోక్షంగా అభివృద్ధి ముసుగులో అరణ్యాన్ని అంతం చేస్తున్నారని మన్యం ప్రజలు, మేధావులు,

- మిగతా 2 లో

40 ఏళ్ల గరిష్ఠానికి అమెరికా ద్రవ్యోల్బణం

- 1981 తర్వాత అత్యధిక స్థాయికి పెరిగిన వైనం
- ఆహారంపై 10శాతానికిపైగా - ఇంధన ధరల్లో 34శాతానికిపైగా పెంపు

వాషింగ్టన్ : పెరుగుతున్న ధరలలో అగ్రరాజ్యం అల్లాడిపోతోంది. అమెరికాలో ద్రవ్యోల్బణం 40ఏళ్ల గరిష్ఠానానికి చేరుకుంది. 1981 సంవత్సరం తర్వాత అత్యధిక స్థాయికి పెరిగింది. ఇంధ నం ధరలు గతనెల కొత్త రికార్డులను నమోదు చేశాయి. పెట్రోల్ ధర పెంపుదల ప్రభావంతో మిగతా వస్తువుల ధరలు ఒకశాతం మేర పెరిగాయి. గ్యాలన్ (3.785 లీటర్లు) పెట్రోల్ ధర ఐదు డాలర్లకు (రూ. 390) చేరుకుంటోంది. ఆహార, ఇంధన ధరలు పెరిగిపోతుండటంతో ద్రవ్యోల్బణం రేటు 1981 తర్వాత అత్యధిక స్థాయికి పెరిగింది. ఏప్రిల్‌లో కొంత తగ్గినాగానీ వార్షిక ద్రవ్యోల్బణం రేటు మేలో 8.6 శాతానికి పెరిగిందని కార్మికశాఖ తెలిపింది. ఆహార పదార్థాల ధరలు 2021, మేతో పోల్చితే 2022, మేలో 10శాతానికిపైగా పెరిగాయి. ఇంధన ధరలు ఏకంగా 34 శాతానికి పైగా పెరిగాయి. ఈ పెరుగుదల ఫలితంగా విమానాల టికెట్లు మొదలు.. దుస్తులు, వైద్య సేవల మరింత ప్రియమయ్యాయి. వినియోగ వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. తాజా పరిస్థితుల్లో కొనుగోలుశక్తి దెబ్బతినడంతో ఆర్థిక వృద్ధి తిరోగమిస్తోందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. ఉక్రెయిన్ యుద్ధం, చైనాలో కోవిడ్ లాక్‌డౌన్, పంపిణీ వ్యవస్థలకు ఆటంకాలతో ఆర్థిక వృద్ధి దెబ్బతింటోందని చెబుతున్నారు. ఇప్పటికే చాలా దేశాల్లో ఆర్థిక మాంద్యం ఉందని ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు డేవిడ్ మాల్పాస్ ఇటీవల అన్నారు. ధరలను తగ్గించటానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని అమెరికా విత్త మంత్రి జానెట్ యెల్లెన్ ఈ మధ్యన వాషింగ్టన్‌లో చెప్పారు. ద్రవ్యోల్బణం ధాటికి అమెరికా స్టాక్‌మార్కెట్లు సైతం పతనమవుతున్నాయి. పెరుగుతున్న ధరలను కట్టడి చేయలేకపోతున్నా రంటూ అధ్యక్షుడు జో బైడెన్‌పై రిపబ్లికన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. కాగా, ధరలను తగ్గించడం కోసం మరింత కృషి చేస్తున్నట్లు, వేగవంతంగా చర్యలను తీసుకుంటున్నట్లు బైడెన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆహారం, ఇంధనం ధరలను తగ్గించడానికి శాయాశక్తులా ప్రయత్నిస్తానని కాలిఫోర్నియాలోని పోర్ట్ ఆఫ్ లాస్ ఏంజిల్స్‌లో మాట్లాడిన ఆయన అన్నారు. అయితే తాజా పరిణామాల క్రమంలో అమెరికా సెంట్రల్ బ్యాంకు 'ఫెడరల్ రిజర్వ్' వడ్డీలు పెంచేస్తోంది. ద్రవ్యోల్బణం వార్షిక పెరుగుదల రేటు 8.6 శాతంగా ఉండటమనేది 40 ఏళ్లలో జరగలేదని బ్యాంక్‌రేట్ డాట్ కామ్‌లో ఆర్థిక విశ్లేషకుడు గ్రెగ్ మెక్‌బ్రైడ్ అన్నారు.

అమెరికా వెళ్లాలా.. కోవిడ్ నెగటివ్ అక్కర్లేదు

వాషింగ్టన్ : అమెరికాకు వెళ్లాలంటే ఒక రోజు ముందుర కోవిడ్ పరీక్ష చేయించుకొని నెగటివ్ వస్తేనే ప్రయాణించే అవకాశం ఉండేది. కానీ ఇప్పటి నుంచి ఆ పరిస్థితి ఉండదు. అంతర్జాతీయ ప్రయాణికులకు కోవిడ్ నెగటివ్ రిపోర్టు తప్పనిసరి కాదని బైడెన్ ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు తెలిపింది. ఆదివారం నుంచి తాజా ఆదేశాలు అమల్లోకి వస్తాయి. కోవిడ్‌పై పోరాటంలో సాధించిన పురోగతి కారణంగానే తాజా నిర్ణయం సాధ్యమైందని అమెరికా ఆరోగ్య మంత్రి జేవియర్ బెసెర్రా అన్నారు. కోవిడ్ నెగటివ్ నివేదిక తప్పనిసరి చేయడం వల్ల చాలా మంది ప్రయాణికులు అంతర్జాతీయ ప్రయాణాలపై ఆసక్తి చూపడం లేదని, వైరస్ సోకితే విదేశాల్లో చిక్కుకుపోతామని భయపడుతున్నారని, ఈ ఆంక్షలను సడలించాలని కొన్ని నెలలుగా ఎయిర్‌లైన్, టూరిజం సంఘాలు తమ యంత్రాంగాన్ని కోరుతున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, తాజా పరిణామాణాన్ని అమెరికా ట్రావెల్ అసోసియేషన్ అధ్యక్షుడు రోగర్ డో స్వాగతించారు. గొప్ప ముందడుగని అన్నారు. ఇక వైమానిక రంగం పుంజుకోగలుగుతుందని ఆకాంక్షించారు.

అరణ్యరోదన

(మొదటిపేజీ తరువాయి)

సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకప్పుడు మండు వేసవిలో కూడా పన్నీటి జల్లులు కురిపించి చల్లదనాన్నిచ్చే మన్యం నేడు మైదాన ప్రాంతంగా మారి ఎడారిని తలపిస్తోంది. దీనికంతటికీ ప్రధాన కారణం జాతీయ రహదారి నిర్మాణం అని చెప్పక తప్పదు. రాజమండ్రి నుంచి రంపచోడవరం పాడేరు మీదుగా అరకు లోయ నుంచి విజయనగరం వరకు హైవే నిర్మాణం జోరుగా జరుగుతోంది. అయితే ఈ హైవే రహదారి నిర్మాణంలో లక్షలాది చెట్లు నేలకొరిగాయి. ఏ ప్రాంతంలో ఎలా ఉన్నా అరకులోయ అంటేనే ఆంధ్రా ఊటగా ప్రసిద్ధిచెందింది. అటువంటి అరకులోయ నేడు జాతీయ రహదారి నిర్మాణం వల్ల పచ్చదనాన్ని కోల్పోయి అందవిహీనంగా కనిపిస్తూ ప్రతి ఒక్కరికి ఆవేదనకు గురి చేస్తుంది. అరకు పర్యటనకు వచ్చే దేశవిదేశీ పర్యాటకులు విశాఖ ఏజెన్సీ ప్రధాన ద్వారం శివ లింగాపురానికి వచ్చేసరికి మండు వేసవిలో కూడా అతి చల్లటి గాలులు స్వాగతం పలుకుతాయి. గాలికొండ ప్రాంతానికి వచ్చేసరికి గల గల పారే సెలయేళ్లు, సహజ సిద్ధంగా వెలసిన అత్యద్భుత అందాలు దర్శనమిస్తాయి. అక్కడనుంచి సుంకరమెట్ట కాఫీ తోటలు మనసును రంజింప జేస్తాయి. ఇక బల్లుగుడ గ్రామం నుంచి ఇరువైపులా పొడవైన సిల్వర్ ఓక్ చెట్లు పరిసరాల్లో పచ్చని పంట పొలాలు కనులకు వీనుల విందు చేస్తాయి.

ఇది అంతా గత కొన్ని నెలల ముందు మాట. ప్రస్తుతం జాతీయ రహదారి నిర్మాణంతో అరకులోయ అందాలు చిన్నాభిన్నమయ్యాయి. రహదారికి రెండువైపులా ఉన్న చెట్లను ఇష్టారాజ్యంగా నరికి వేయడం, రోడ్డు నిర్మాణం కారణంగా వాహనాల దుమ్ము ధూళి విస్తృతంగా వ్యాపించడంతో స్థానికులే కాకుండా పర్యాటకులు సైతం అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు తమ ఇష్టారాజ్యం పాలను పక్కన పెట్టి ప్రజాభీష్టం మేరకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అందుకు తగిన విధంగానే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ప్రజలు ఈ ప్రాంతవాసులు, గిరిజనులు, గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. లేనిపక్షంలో ప్రజా ఆగ్రహానికి గురై ప్రభుత్వాలు పతనం కాక తప్పదని వారంతా హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అభివృద్ధి ముసుగులో పచ్చని చెట్ల పై గొడ్డలి వేటు వేసిన ప్రభుత్వాలు ఆ చెట్ల పెంపకానికి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించి ప్రకృతిని కాపాడాలంటే ప్రజలు కోరుతున్నారు.

కలరాతో ఉక్రెయిన్ పోరు

లేని రక్షిత తాగునీరు- కరవైన పారిశుద్ధ్యం

లండన్ : రష్యాతో యుద్ధం క్రమంలో ఉక్రెయిన్ చాలా నష్టపోయింది. అనేక నగరాలు ధ్వంసం కాగా వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది నిరాశ్రులయ్యారు. వైద్యసేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. మందుల కొరత నెలకొంది. టెలిఫోన్, అంతర్జాల సేవలకు అంతరాయం కలిగింది. రక్షిత తాగునీరు లేదు. మౌలిక వసతులు దెబ్బతిన్నాయి. దీంతో ఆ దేశాన్ని కలరా భయపెడుతోంది. ఈ వ్యాధి మరింతగా ప్రబలే అవకాశం ఉందని బ్రిటన్ రక్షణశాఖ తాజాగా హెచ్చరించింది. మారియూపోల్‌లో కలరా తీవ్రతరం అయ్యే సూచనలు ఉన్నట్లు పేర్కొంది. వైద్య సేవలు అందక.. మందులు లేక క్లిష్టపరిస్థితులను ఎదుర్కోవాల్సి రావచ్చు అని ఉక్రెయిన్‌ను హెచ్చరించింది. తగు జాగ్రత్తలు అవసరమని సూచించింది. మారియుపోల్‌లో కలరా ముప్పు చాలా ఎక్కువని ఉక్రెయిన్ ఆరోగ్య అధికారులు అన్నారు. తాగునీటి సరఫరా దెబ్బతిని పారిశుద్ధ్యం లోపించి కలరా మహమ్మారి మారియూపోల్‌ను కబళించిందన్నారు. ఈ ప్రాంతంలో కలరా 'రెడ్'లో ఉందని మేయర్‌కు సలహాదారు పెట్రో ఆండ్రియుశ్చెంకో అన్నారు. రష్యా సైనిక చర్యల క్రమంలో కేసుల వివరాలను వెల్లడించలేమని చెప్పారు. నగరంలోని అనేక మంది జలుబు, జ్వరంతో బాధపడుతున్నట్లు టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. మందులు లేక వైద్యసంరక్షణ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. నీటి సరఫరాను, సరైన పారిశుద్ధ్యాన్ని నగరంలో పునరుద్ధరించగలిగితే మహమ్మారిని కట్టడి చేసేందుకు వీలు ఉంటుందని ఆయన వెల్లడించారు. కాగా, 1995లో ఉక్రెయిన్‌లో కలరా ప్రబలింది.

అరెస్టుల పర్వం

(మొదటిపేజీ తరువాయి)

ఫాతిమా ఇదే విషయమై జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. తక్షణమే జోక్యం చేసుకోవాలని తన కుటుంబాన్ని ఎటువంటి నోటీసు, వారెంటు లేకుండా అలహాబాద్ పోలీసులు అరెస్టు చేశారని, వారి గురించి ఎలాంటి సమాచారం లేదని లేఖ రాశారు. అర్ధరాత్రి పోలీసు స్టేషన్‌కు వెళ్లేందుకు నిరాకరించగా ఇంటిని ఖాళీ చేయాలని, తాళం వేయమని పోలీసులు గదమాయించారన్నారు. దీనికి రెండు రోజులు ముందు ఐపీసీలోని 107 సెక్షన్ కింద తన తండ్రిపై హింస కేసు నమోదు అయిందని, దీని ప్రకారం నగరంలో ఏమి జరిగినా అందుకు బాధ్యత ఆయనదే అన్నట్లుగా ఉందని ఆఫ్రీన్ తెలిపారు. జావేద్ మహమ్మద్ గురించి సమాచారం ఇచ్చేందుకు కరేలీ, ఖుల్దాబాద్ పోలీసు స్టేషన్ల ఇంచార్జీలు నిరాకరించినట్లు 'దివైర్' పేర్కొంది. సీఏఏ వ్యతిరేక ఆందోళనకారులే లక్ష్యంగా అరెస్టులు జరుగుతున్నాయని కార్యకర్త సారా అహ్మద్ విమర్శించారు. 'ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి ఒకదాని తర్వాత ఒకటిగా ఫోన్లు రావడం మొదలైంది. కేసులో కీలక సూత్రధారిగా నా పేరును పేర్కొన్నట్లు చాలా మంది తెలిపారు. నా పేరుతో వార్తాకథనాలు వచ్చాయి. సీఏఏ-ఎన్‌ఆర్సీ ఆందోళనల్లో అగ్రభాగాన నిలిచినందుకు లక్ష్యంగా చేస్తున్నారు. కేసుల్లో ఇరికిస్తున్నారు. ఆందోళనతో నాకు సంబంధం లేదు' అని అన్నారు. హింస చెలరేగినప్పుడు తాను పట్టణంలోనే లేకపోయినా పోలీసులు తనను లక్ష్యంగా చేస్తున్నట్లు కార్యకర్త ఉమర్ ఖాలిద్ కూడా ఫేస్‌బుక్ ద్వారా మొరపెట్టుకున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో 'బుల్డోజర్' హెచ్చరికలను పోలీసులు చేశారు. ఖుల్దాబాద్, కరేలీ పోలీసు స్టేషన్‌లలో అనేక కేసులు నమోదు కాగా గుర్తించిన 36 మందిపై, గుర్తుతెలియని వెయ్యి మందిపై ఓ కేసు ఉంది. పది మంది 'ప్రధాన నిందితుల'ను పట్టుకునేందుకు పోలీసు బృందాలు అనేకచోట్ల తనిఖీలు చేపట్టాయి. నిందితులుగా పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేక ఆందోళనలో ప్రముఖంగా వ్యవహరించిన వారు, ఏఐఎంఐఎం నేతలు, విద్యార్థి కార్యకర్తలు, వామపక్షాల కార్యకర్తల పేర్లు ఉన్నాయి. వీరిలో ఇమామ్ అలీ అహ్మద్ (అతలా బదిమజీద్), ఏఐఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షా ఆలం, నేత జీషన్ రెహమానీ, సీఏఏ వ్యతిరేక ఆందోళనకారులు సారా అహ్మద్, వామపక్ష నేతలు డాక్టర్ ఆశీష్ మిట్టల్, అలీ అహ్మద్ నిందితుల జాబితాలో ఉన్నారు. చాలా మందిని గుర్తించామని, ఇది ప్రణాళికాబద్ధంగా జరిపిన హింస అని ప్రయాగ్‌రాజ్ ఏడీజీ ప్రేమ్‌ప్రకాశ్ చెప్పారు. నిందితుల జాబితాలో సమాజ్‌వాదీ పార్టీ నేతలూ ఉన్నారు. హింసకు కారకులపై గూండా చట్టం, జాతీయ భద్రతా చట్టం కింద చర్యలు తీసుకుంటామని ఏడీజీ తెలిపారు. అంతే కాదు అక్రమ కట్టడాలను తొలగింపునకు అటలా ప్రాంతంలో బుల్డోజర్లు నడుపుతారన్నారు.

ఇక దేశరాజధాని ఢిల్లీలోనూ నిరసనలు మిన్నంటాయి. జమామసీదు వద్ద జరిగిన నిరసన నేపథ్యంలో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముస్లింలు ప్రార్థనల అనంతరం ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీజేపీ నేతలు నూపుర్ శర్మ, నవీన్ జిందల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జమా మసీదు వద్ద 1500 మంది ప్లకార్డులతో ఆందోళన చేపట్టినట్లు డీసీపీ శ్వేతా చౌహాన్ తెలిపారు. ఐపీసీలోని 188 సెక్షన్ కింద ఆందోళనకారులపై కేసు నమోదు అయిందని, దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. 10-15 నిమిషాల్లోనే నిరసనకారులను చెదరగొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో వంద మందిపై కేసులు నమోదు అయ్యాయి. నూపుర్ శర్మ, నవీన్ జిందల్‌పై కఠిన చర్యలకు నిరసనకారులు డిమాండు చేశారు. ఆందోళనకారులపై ఐపీసీలోని 149 సెక్షన్‌తో పాటు మోటార్ వాహనాల చట్టం కింద కేసు నమోదు అయినట్లు బేగంపురా పోలీసు స్టేషన్ అధికారి తెలిపారు. ఔరంగాబాద్‌లోని ఢిల్లీ గేట్ ప్రాంతంలోని డివిజనల్ కమిషనర్ కార్యాలయం వద్ద ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో ఆందోళన జరుగగా 50-60 మంది బైకులపై అనేకమంది కాలినడకన వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ ఘర్షణ తరహా వాతావరణం నెలకొందన్నారు. కాగా, రాంచీలో పోలీసుల కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు.

వైసీపీ ఓట్లే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

లేకపోయింది. నాడు ఎన్నికల ముందు తన పార్టీకి 25మంది ఎంపీలను గెలిపిస్తే ఏపీకి ప్రత్యేక హోదా తెస్తామని చెప్పగా, ఇంచుమించుగా 22 మంది ఎంపీలను ప్రజలు గెలిపించారు. ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వానికే ఎంపీలు ఉభయసభల్లో మద్దతిస్తున్నారు. అడ్డగోలుగా వారు చేస్తున్న చట్టాలకు మద్దతిస్తున్నారు. నాడు రాష్ట్రపతి ఎన్నికల్లోనూ బీజేపీ బలపరిచిన అభ్యర్థి రామ్‌నాథ్ కోవింద్‌కు వైసీపీ సంపూర్ణ మద్దతిచ్చింది. రెండోసారైనా రాష్ట్ర ప్రయోజనాలపై మోదీని జగన్ గట్టిగా నిలదీస్తే బాగుంటుందని విపక్షాలు సూచిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ కారు చౌకగా మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెడుతోంది. కడపకు స్టీల్ ఫ్యాక్టరీ ఇవ్వకపోగా, విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తున్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిలదీయడంలో వైసీపీ విఫలమైంది. నిత్యం మోదీని జగన్‌ను కలుస్తూ, రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టకుండా, సొంత అజెండాతోనే ముందుకు పోతున్నారనే విమర్శలున్నాయి.

టీడీపీదీ ఇదే ధోరణి

నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, స్టీల్‌ప్లాంట్, రెవెన్యూ లోటుభర్తీ, పోలవరం ప్రాజెక్టు, రాజధానికి నిధులు ఇచ్చింది. వాటిని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయలేదు. ఐదేళ్లపాటు అధికారంలో ఉన్న టీడీపీ వీటిని విస్మరించింది. ప్రస్తుతం కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి రాష్ట్రపతి ఎన్నికల్లో గెలవాలంటే వైసీపీ, టీడీపీల మద్దతు అవసంముంది. రాష్ట్ర శ్రేయస్సుపై ఈ రెండు పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే జూలై 18లోపు ప్రత్యేక హోదా ఇస్తేనే, చట్టంలోని అన్ని అంశాలను అమలు చేస్తేనే బీజేపీ నిలబెట్టిన రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతిస్తామని అల్టిమేటం ఇవ్వాల్సిన అవసరముంది. మళ్లీ ఎలాంటి షరతులు లేకుండా, ఏపీ ప్రయోజనాలపై కేంద్రం నుంచి బలమైన హామీ లేకుండా, రాష్ట్రపతి ఎన్నికలకు వైసీపీ మద్దతిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

పోలీసు వ్యవస్థ నిర్వీర్యం: వర్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో పోలీసు వ్యవస్థ తన ఉనికిని పూర్తిగా కోల్పోయినట్లు కనిపిస్తోందనీ, అధికార పార్టీ చేతిలో కీలుబొమ్మగా మారడం బాధాకరమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య విమర్శించారు. మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్ సీఎంగా పదవీ స్వీకారం చేసిన నాటి నుంచి రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. పలుమార్లు పోలీసు అధికారులను హెచ్చరించినా వారి పనితీరులో మార్పు రాలేదనీ, అధికార పార్టీ కనుసన్నల్లో పోలీసు వ్యవస్థ పనిచేస్తోందనడానికి చాలా ఉదాహరణలున్నాయని చెప్పారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్‌ను చంపి కారులో తీసుకొచ్చి మృతుడి ఇంటిముందర పడేసి వెళ్లాడంటే అతడికి ఎంత ధైర్యమంటూ నిలదీశారు. వివేకా హత్య కేసులోనూ పోలీసు, సీబీడీ అధికారులు తమ విధులను సక్రమంగా వినియోగించలేక పోతున్నారన్నారు.

విద్యార్థులతో ప్రభుత్వ చెలగాటం

మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని టీడీపీ నేత, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. విద్యా వ్యవస్థను సమూలంగా నాశనం చేసిందని, 40 ఏళ్ల క్రితమున్న ఫలితాలను ఇప్పుడు జగన్ తీసుకొచ్చారంటూ ఎద్దేవా చేశారు. రెండు లక్షల మంది విద్యార్థులు ఫెయిల్ కావడం అంటే రాష్ట్రంలో ఎంత దారుణమైన పరిస్థితులున్నాయో అర్థం చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు టీడీపీ జూమ్ మీటింగ్‌లోకి రావడమేమిటంటూ మండిపడ్డారు. ఫెయిల్ అయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారిలో మనోధైర్యాన్ని నింపాలిగానీ, ఇలా వెకిలి పనులకు పాల్పడరాదని హితవు పలికారు. పది ఫెయిల్ విద్యార్థులు బాధపడుతుంటే ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ప్రశ్నపత్రాలను లీకుల మీద లీకులు చేశారనీ, పది పరీక్షల సమయంలో విద్యాశాఖ మంత్రి, సజ్జల రామకృష్ణారెడ్డి పొంతన లేని సమాధానాలు చెప్పారన్నారు. చంద్రబాబు హయాంలో విద్యాశాఖకు ప్రాధాన్యతనిచ్చి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచుతూ పోయారని, జగన్ మాత్రం అమాంతంగా తగ్గించేశారని మండిపడ్డారు.

తగ్గాల్సిందే...

(మొదటిపేజీ తరువాయి)

వ్యయం (పీఎఫ్‌సీఈ) భారతదేశ జీడీపీ ముఖ్యమైన భాగం. ఇది వస్తువులు, సేవల వినియోగంపై ప్రజలు ఎంత వ్యయం చేస్తున్నారనే దానికి ఒక కొలమానం. మే 31న జాతీయ ఖాతాల గణాంకాలు 2020-21కి సంబంధించిన వినియోగ వివరాలు (సవరించిన అంచనాలు) ను పరిశీలిస్తే, భారతీయులు వినియోగ ప్రయోజనాల కోసం తమ డబ్బును ఎక్కడ ఖర్చు చేశారనే వివరాలు ఇందులో ఉన్నాయి. ఈ సంఖ్యలు ప్రతి రిటైల్ పరిశ్రమలో జరిగిన మార్పుల పరిమాణాన్ని అంచనా వేస్తాయి. మునుపటి, మహమ్మారి లేని ఆర్థిక సంవత్సరం (2019-20)తో పోల్చితే, ఆహారం, గృహోపకరణాలు మాత్రమే సానుకూల వృద్ధి రేటును సాధించాయి. అయితే అన్ని ఇతర సమూహాల వస్తువులపై ఖర్చు తగ్గింది.

రెస్టారెంట్, హోటల్ ఖర్చులలో పెద్ద కోతలు

మహమ్మారి సంవత్సరంలో అత్యధికంగా దెబ్బతిన్న వినియోగదారుల రంగాలలో రెస్టారెంట్లు, హోటళ్లు, దుస్తులు, పాదరక్షలు, మన్నికైన, సెమీ మన్నికగల వస్తువులు, రవాణా, మద్య పానీయాలు, పొగాకు, మాదక ద్రవ్యాలు (మత్తు), గృహోపకరణాలు, వినోద రంగాలు ఉన్నాయి. 2019-20తో పోలిస్తే 2020-21లో వృద్ధిలో 10 శాతానికి పైగా క్షీణతను నమోదు చేశాయి. అదే సమయంలో ఈ రంగాలలో మొత్తం వినియోగం 6 శాతం పడిపోయింది. 2020-21లో భారతీయులు రెస్టారెంట్లు, హోటళ్లపై రూ.92,671 కోట్లు ఖర్చు చేయగా, అంతకుముందు సంవత్సరం కంటే రెండింతలు రూ.రూ. 2 లక్షల కోట్లు ఖర్చు చేశారు. మహమ్మారికి ముందు ఐదు సంవత్సరాలలో 2015-16 నుంచి 2019-20 వరకు సగటున, ఈ రంగంలో వినియోగం సగటున రూ.1.7 లక్షల కోట్లతో సంవత్సరానికి 8.7 శాతం వృద్ధి చెందింది.

మహమ్మారి కారణంగా పర్యాటక పరిశ్రమకు తీవ్ర దెబ్బ తగిలింది. ఫలితంగా అనేక హోటళ్లు మూతపడ్డాయి. రెస్టారెంట్లలో కోవిడ్ ఆంక్షలు విధించిన కారణంగా వారి అడుగులు కూడా బాగా తగ్గాయి. రెస్టారెంట్, హోటల్ రంగం సగటున (2015-2020) భారతదేశ దేశీయ వినియోగ వ్యయంలో 2.4 శాతం వాటాను కలిగి ఉంది. ఇది మహమ్మారి సమయంలో కేవలం 1.2 శాతానికి తగ్గిందని గణాంకాలు పేర్కొన్నాయి. ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ గుర్బక్షిష్ సింగ్ కోహ్లీ ప్రకారం, మొదటి మహమ్మారి సంవత్సరంలో పరిశ్రమ రూ.1.4 లక్షల కోట్ల నష్టాన్ని అంచనా వేసింది. భారతీయులు దుస్తులపై కూడా తక్కువ డబ్బు ఖర్చు చేశారు. 2019-20లో దుస్తులు, పాదరక్షల కోసం దాదాపు రూ.4.43 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇది 2020-21లో 22.2 శాతానికి పడిపోయింది. ఈ వస్తువుల వినియోగం ఇప్పటికే 1.3 శాతం వద్ద నెమ్మదిగా పెరుగుతోంది. ఇది మహమ్మారి ద్వారా మరింత తీవ్రమైందని గణాంకాలు వివరించాయి.

మహమ్మారి తమ కదలికలను నియంత్రించడంతో రవాణాపై తమ ఖర్చును చాలా వరకు తగ్గించుకున్నారు. 2020-21లో వినియోగదారులు రవాణాపై రూ.12.27 లక్షల కోట్లు ఖర్చు చేశారు. 2019-20 (రూ. 15.23 లక్షల కోట్లు)తో పోలిస్తే 19.4 శాతం తగ్గదల.

ఖర్చు పెరిగింది ఎక్కడంటే...

మహమ్మారి సమయంలో ఆహారం, గృహోపకరణాల వంటి అవసరమైన వస్తువులపై ఖర్చు పెరిగింది. 2019-20లో రూ.22.6 లక్షల కోట్ల నుంచి 2020-21లో రూ.23.5 లక్షల కోట్లకు, ఆహారం, పానీయాల వ్యయం (ఆల్కహాలిక్ రహిత) 3.9 శాతం వృద్ధి చెందింది. శీతల పానీయాలు, మినరల్ వాటర్, పండ్లు, కూరగాయల రసాలపై వినియోగదారుల వ్యయం దాదాపు 28 శాతం తగ్గింది. (2019-20లో రూ. 21,000 కోట్ల నుండి 2020-21లో రూ. 15,000 కోట్లకు). ఆహార ఉత్పత్తులలో, నూనెలు, కొవ్వులు అత్యధికంగా ఖర్చులు (18.6 శాతం) నమోదు చేశాయి. మరెక్కడా వర్గీకరించని ఆహార ఉత్పత్తులు (ఎక్కువగా సుగంధ ద్రవ్యాలు) 9.4 శాతంగా ఉన్నాయి.

అలాగే 2019-20లో రూ.21,000 కోట్లుగా ఉన్న గుడ్లపై ఖర్చు 2020-21లో రూ.22,500 కోట్లకు పెరిగింది. 2020-21లో మాంసాహారంపై ఖర్చు 4.4 శాతం వృద్ధి చెందగా, చేపలు, సముద్రపు ఆహారంపై ఖర్చు 4.8 శాతం పెరిగి రూ.1.27 కోట్ల నుంచి రూ.1.34 కోట్లకు చేరుకుంది.

రేషన్ కార్డుల కుదింపు దారుణం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రేషన్ కార్డుల సంఖ్యను కుదించేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మార్గదర్శకాలను జారీ చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. లబ్ధిదారులను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తవారికి కార్డులు ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకు రూ.10వేలు పైబడి, పట్టణ ప్రాంతాల్లో రూ.15వేల పైన ఆదాయమున్న వారిని రేషన్ కార్డుకు అనర్హులుగా పేర్కొంటూ, పలు నిబంధనలతో కేంద్రం జారీ చేసిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని అన్నారు. వృత్తి ఆధారంగా అనర్హులుగా లెక్కగట్టడం సరికాదని పేర్కొన్నారు. దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారికి ప్రభుత్వం నుంచి చౌక ధరలకు నిత్యావసరాలు అందించడానికి, ప్రభుత్వ పథకాలకు అర్హతగా ఉపయోగించే రేషన్ కార్డును కుదించడమంటే పేదలకు సంక్షేమ పథకాలు దూరం చేయడమేనన్నారు. మోదీ ప్రభుత్వ విధానాలు పూర్తిగా పేద, మధ్యతరగతి ప్రజలను దెబ్బ తీసేవిగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా ప్రభావంతో ఉపాధి కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ప్రజల నెత్తిపై ధరలు, పన్నులు పేరుతో రోజుకో భారం వేస్తున్నారని, ఇది చాలదన్నట్లు కొద్దిపాటి ఉపశమనంగా ఉన్న రేషన్ కార్డుల కుదింపునకు దిగడం దారుణమని అన్నారు.

సోనియా, రాహుల్‌పై దుష్ప్రచారం

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శైలజానాథ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నేషనల్ హెరాల్డ్ కేసు నమోదు ద్వారా సోనియా, రాహుల్ గాంధీపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు సాకే శైలజానాథ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోనియా, రాహుల్ నిజాయితీగా ఉన్నప్పటికీ, మతోన్మాద శక్తులు వారిపై అసత్య ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్ని కేసులు నమోదు చేసినా వారిని ఏమీ చేయలేరని, వారి నిజాయితీ తెలుస్తుందని స్పష్టం చేశారు. 2002 నుంచి 2011 వరకు 100 వాయిదాలలో చెల్లించేలా రూ.90 కోట్లు రుణం రూపేణా ఇచ్చిందని, అందులో రూ.67 కోట్లను నేషనల్ హెరాల్డ్ ఉద్యోగుల జీతాలకు, వలంటరీ రిటైర్మెంట్ కోసం ఖర్చు చేశారని వివరించారు. కాంగ్రెస్‌కు నేషనల్ హెరాల్డ్ పత్రిక బకాయి ఉన్న రూ.90.25 కోట్లను వసూలు చేసుకునే హక్కును పొందేందుకు యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా నేరపూరితమైన కుట్ర పన్నారంటూ సుబ్రహ్మణ్యస్వామి చేసిన ఆరోపణను శైలజనాథ్ కొట్టి పారేశారు. ఇందుకు సంబంధించి సోనియా, రాహుల్‌గాంధీ సహా ఏడుగురిపై ఢిల్లీలోని అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో స్వామి కేసు దాఖలు చేయడం బూటకమన్నారు.

ఉగ్రవాదం అంతమే ప్రభుత్వ లక్ష్యం

జమ్మూకాశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హా

శ్రీనగర్ : నిరాశలో కూరుకుపోయిన ఉగ్రమూకలు జమ్మూకాశ్మీర్‌లో అమాయకులే లక్ష్యంగా హత్యలకు పాల్పడుతున్నాయని రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అన్నారు. శనివారం ఆయన కుల్గాం జిల్లాలో జరిగన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ...హత్యలకు వ్యతిరేకంగా ప్రజలంతా రోడ్లపైకి వచ్చి ఆందోళనలు నిర్వహిస్తారని, ఆక్రమంలో భద్రతా బలగాలను రెచ్చగొట్టి వారి ద్వారా మరి కొందరు అమాయకుల ప్రాణాలను తీయాలనే కుట్రలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆ అవకాశం ఇవ్వదని చెప్పారు. రాష్ట్రంలో జరిగిన అన్ని హత్యలు అమాయకులను లక్ష్యంగా చేసుకునే చేశారని పేర్కొన్నారు. ఉగ్రవాదుల నిరాశ ఈ హత్యల ద్వారా బయటపడుతోందన్నారు. యావత్ సమాజం ఈ హత్యను ఖండించాలన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పే మహిళా ఉపాధ్యాయురాలు హత్యకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, భద్రతా బలగాలు ఉగ్రవాదుల చుట్టూ ఉచ్చు బిగిస్తున్నాయని తెలిపారు. ఆరిపోయే దీపానికి వెలుగు ఎక్కువనే చందంగా ఉగ్రవాదం నశించే స్థితిలో ఉందని చెప్పారు. శాంతి ద్వారానే రాష్ట్ర అభివృద్ధిబాటలో పయనిస్తుందని, రాష్ట్రంలో ఉగ్రవాదాన్ని అంతం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని పేర్కొన్నారు.

ఉద్రిక్తతలు పెంచేందుకే హౌరా పర్యటన

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిపై టీఎంసీ ఆగ్రహం

కోల్‌కతా : ప్రజల మధ్య మతపరమైన విద్వేషాల్ని రెచ్చగొట్టడం ద్వారా ఉద్రిక్తతల్ని మరింత పెంచడానికే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ హౌరా జిల్లా పర్యటన చేపట్టినట్టు టీఎంసీ ఎమ్మెల్యే తపస్ రే ఆరోపించారు. ఆయన్ను హౌరా పర్యటనకు వెళ్లకుండా గృహ నిర్బంధంలో ఉంచి పోలీసులు మంచి పని చేశారని పేర్కొన్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే ఇటీవల బీజేపీ నేతలు నూపుర్ శర్మ, నవీన్ జిందాల్‌లు మహమ్మద్ ప్రవక్తపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో ఆగ్రహానికి లోనైన ఒక వర్గం హౌరా జిల్లాలోని బీజేపీ కార్యాలయాలపై దాడులు చేశారు. కొన్ని చోట్ల కార్యాలయాలకు నిప్పుపెట్టారు. ఈ క్రమంలో తమ పార్టీ కార్యలయాలను ధ్వంసం చేయడాన్ని ఖండించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ శనివారం హౌరా పర్యటనకు వెళుతున్నట్టు ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఆందోళనల కొనసాగుతున్న తరుణంలో శాంతిభద్రతల దృష్ట్యా అయన పర్యటనను కోల్‌కతాలోని ఆయన ఇంటి వద్దే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మజుందార్ మాట్లాడుతూ తమ పార్టీ కార్యాలయాలపై దాడులు జరిగిన క్రమంలో ఆయా ప్రాంతాలను సందర్శించాలని భావించానని, అయితే పోలీసులు అక్రమంగా తనను ఇంటి వద్దే నిలువరించారని పేర్కొన్నారు. ఎందుకు తన పర్యటనను అడ్డుకున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ప్రభుత్వ వైఫల్యం కారణంగానే తమ కార్యాలయాలపై దాడులు జరిగాయని ఆరోపించారు. బీజేపీ ఆరోపణలను అధికార టీఎంసీ తీవ్రంగా తప్పుబట్టింది. బీజేపీ నేతల నోటి దురుసు ఈ పరిస్థితికి కారణమని పేర్కొంది. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మజుందార్‌ను నిలువరించినట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

పాఠశాల, ఇంటర్ ఫీజులపై ఆర్డినెన్స్ తేవాలి

నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంతకుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పాఠశాల, ఇంటర్మీడియట్ విద్య ఫీజులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ తేవాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంత కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు శనివారం ఆయన లేఖ రాశారు. ఈ ఏడాది ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులను తల్లిదండ్రులకు, ప్రైవేట్ విద్యా సంస్థలకు సమ న్యాయం ఉండేలా నిర్ణయించి, దానిపై ఆర్డినెన్స్ తేవాలన్నారు. గతేడాది ఫీజు నియంత్రణ కమిషన్ అధ్వర్యంలో పాఠశాల, ఇంటర్మీడియట్ విద్యకు సంబంధించి 53, 54 జీవోలు విడుదల చేశారని వివరించారు.

దాని ప్రకారం ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఏడాదికి రూ.12వేలు, ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.18వేల ఫీజు చెల్లిస్తే సరిపోతుందని కమిషన్ నిర్ణయించిందని, ఆ దిశగా జీవోలు జారీచేసిందని గుర్తుచేశారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం దీనిపై హైకోర్టుకు వెళ్లి, వారికి నష్టం వస్తుందంటూ దావా వేయగా, కోర్టు ఆయా జీవోలను కొట్టి వేసిందని తెలిపారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ విద్యా సంస్థలలో చదివిస్తున్న తల్లిదండ్రులంతా గత్యంతరం లేక పూర్తి ఫీజులను చెల్లించి నష్టపోయారన్నారు.

తాడిపత్రిలో ఉద్రిక్తత

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: నంద్యాల రోడ్‌లోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద మరమ్మతులు కోసం వైసీపీ, టీడీపీ కౌన్సిలర్స్ పోటీపడడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అధ్వర్యంలో రెండు రోజుల నుంచి నంద్యాల రోడ్‌లోని అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద శనివారం మురుగు నీటి పైపులు మరమ్మతు పనులు జరుగుతున్నాయి. జేసీబీలు ఏర్పాటు చేసి పూడికతీత పనులు చేపడుతున్నారు. మురుగునీరు కాలువ మరమ్మత్తులు తాము చేస్తాం అంటే తాము చేస్తామంటూ పోటాపోటీగా టీడీపీ, వైసీపీ నాయకులు జేసీబీలతో మోహరించారు. దీంతో పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశారు. ముందుగా కాలువ మరమ్మతు పనుల వద్దకు టీడీపీ కౌన్సిలర్స్ చేరుకోగా పోలీసులు వారికి నచ్చజెప్పి అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో వైసీపీ నాయకుల అక్కడికి చేరుకున్నారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఒకరిపై ఒకరు దాడి పాల్పడ్డారు. ఈ దాడిలో కౌన్సిలర్ మల్లికార్జున, కాంట్రాక్టర్ మైత్రి మల్లికార్జున రెడ్డి, ఈనాడు రిపోర్టర్ ఎర్రిస్వామిలపై వైసీపీ నాయకులు దాడి చేయగా వారికి తీవ్ర గాయాలు కావడంతో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ఘటనపై డీఎస్పీ చైతన్య అధ్వర్యంలో విచారణ చేపట్టారు. పూడికతీత పనులు నిలిపి వేసి జేసీబీలను వెనక్కి పంపారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉక్కు పరిరక్షణకు పోరాటాలే శరణ్యం

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణకు పోరాటాలే శరణ్యమని స్టీల్ ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.రామ కృష్ణ తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు శనివారం 485 వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ట్రాఫిక్, ఆర్.ఎం.డి విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ఉక్కు కర్మాగారం ప్రజల సంపదని, ఈ సంపదను ప్రైవేటు వ్యక్తులకు అమ్మే హక్కు కేంద్ర ప్రభుత్వానికి లేదన్నారు. ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు నిర్వాసితులు తమ భూములను, ఇళ్లను ఇచ్చారని, 32 మంది ప్రాణత్యాగాలతో ఈ కర్మాగారం ఏర్పడింద న్నారు. కోట్లాది రూపాయలు నికర లాభాలు ఆర్జిస్తూ, వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం కానివ్వమని స్పష్టం చేశారు. 3.2 మిలియన్ టన్నుల సామర్థ్యం నుంచి 7.3 మిలియన్ టన్నుల స్థాయికి తీసుకురావడంలో కార్మికుల శ్రమ ఎంతో ఉందని, ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మంది ప్రజలకు జీవనోపాధి కల్పిస్తున్న ఈ కర్మాగారాన్ని విక్రయించాలనే ఆలోచనను కేంద్రం విరమించుకోవాలని, లేని పక్షంలో కార్మిక ఆగ్రహానికి గురి కాక తప్పదన్నారు. ఈ దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు జి.బోసుబాబు, వరసాల శ్రీనివాసరావు మాట్లాడారు. దీక్షల్లో ఉద్యోగులు జి.శ్రీనివాస్, సత్తి శ్రీనివాస్‌రెడ్డి, మూర్తి, డి.భాస్కర్‌రావు, ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘పది’ ఫెయిల్ విద్యార్థులకు తరగతులు

- రేపటి నుంచి సబ్జెక్టు టీచర్లతో బోధన
- అడ్వాన్స్ సప్లిమెంటరీకి సన్నద్ధం
- ఉత్తీర్ణత శాతం తగ్గుదలతో చర్యలు
- పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పది పరీక్షల్లో ఫెయిల్ అయిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను అడ్వాన్సు సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు ఈనెల 13 నుంచి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా 71 పాఠశాలల్లో ఒక్క విద్యార్థీ పరీక్ష పాస్ కాలేదు. సున్నా ఫలితాలు వచ్చిన పాఠశాలల్లో 40 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. జూలై 6 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇటీవల విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేసిన పది పరీక్షా ఫలితాల్లో ఉత్తీర్ణతా శాతం తగ్గింది. పది పరీక్షలకు మొత్తం 6,15,908 మంది విద్యార్థులు హాజరు కాగా, 4,14,281 మంది(67.26శాతం) ఉత్తీర్ణత సాధించారు. రెండు లక్షల మంది విద్యార్థులు తప్పడం విమర్శలకు దారితీస్తోంది. పది ఫలితాల్లో ప్రభుత్వం ఫెయిల్ అయిందంటూ విపక్షాలు విమర్శించగా, కరోనా కారణంగానే ఉత్తీర్ణతా శాతం తగ్గిందంటూ ప్రభుత్వం సరిదిద్దుకుంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా, పది ఫెయిల్ అయిన వారికి ప్రత్యేక తరగతులతో బోధనకు విద్యాశాఖ సిద్ధమైంది. అన్ని జిల్లా విద్యాశాఖాధికారులకు ఉత్తర్యులు జారీచేసింది. తగిన ప్రణాళికతో ముందుకు పోవాలని సూచించింది. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రోజుకు రెండు సబ్జెక్టుల చొప్పున పత్యేక తరగతులు విధిగా నిర్వహిస్తారు. . విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా తరగతులు నిర్వహించి అత్యధికంగా ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధమయ్యారు.

నిష్ణాతులతో బోధన

ఆయా సబ్జెక్టుల నిష్ణాతులతో ముందస్తుగా బోధనా ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. సంబంధిత పాఠ శాలల హెచ్‌ఎంలు, టీచర్లు, సీఆర్పీల సహకారంతో తప్పిన విద్యార్థులంతా ప్రత్యేక తరగతులకు హాజరయ్యేలా ఆదే శాలు జారీచేశారు. ఫెయిల్ అయిన విద్యార్థుల రేషియోకు అనుగుణంగా, వారి సబ్జెక్టు టీచర్లను నియమిస్తారు. ఉత్తీర్ణతే లక్ష్యంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు కృషి చేయాలి. అలసత్వం ప్రదర్శించిన ఉపాధ్యాయులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే పది ఫెయిల్ అయిన వారు, మార్కుల శాతం తక్కువ వచ్చిన వారంతా రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేస్తున్నారు. ప్రత్యేక శిక్షణా తరగ తులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కంపార్ట్‌మెంట్ పాస్‌గా కాకుండా రెగ్యులర్ పాస్‌గా ప్రకటిస్తామని ప్రభుత్వం వెల్లడించింది.

రూ.16 వేలు వేతనం చెల్లించండి

ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి

విశాలాంధ్ర -విజయనగరం క్రైమ్: జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులకు, సెక్యూరిటీ గార్డులకు జీవో 549 ప్రకారం వేతనం చెల్లించని పక్షంలో పోరా టం తప్పదని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూతోట ప్రకాష్ హెచ్చరించారు. ఉద్యోగులకు నెలకు రూ.16 వేల వేతనం చెల్లించాలని కోరుతూ శనివారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ జిల్లా శాఖ ప్రతినిధులు ఆసు పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ప్రకాష్ మాట్లాడుతూ పోరాటాల ఫలితంగా 2020 లో ఏపీ ప్రభుత్వం రూ.16వేలు వేతనం పెంపుదల చేస్తూ జీఓ విడుదల చేసినప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.16వేలు జీతాలు ప్రకటించి కార్మికులను ప్రభుత్వం కాంట్రాక్టర్ చేతిలో పెట్టడం దారుణ మన్నారు. ప్రతినెలా సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో ఉద్యోగులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టర్ మారిన తర్వాత 11 నెలలుగా పీఎఫ్ ఎంత జమ చేస్తున్నారో, ఈఎస్ఐ ఎంతో పే స్లిప్పుల ద్వారా తెలియజేయకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కాంట్రాక్టరు వర్కర్స్‌తో వెట్టిచాకిరి చేయిస్తున్నారనీ, వీరిని ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి రోగులకు సేవ చేసి కరోనా బారిన పడినా ప్రభుత్వం పట్టించుకోకపోగా వీరిపై నిర్లక్ష్యం చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు తాలాడ సన్నిబాబు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల బదిలీలపై

స్పష్టత ఇవ్వాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపాల్టీలలో ఉపాధ్యాయుల బదిలీలకు హడావిడిగా షెడ్యూల్ ఇచ్చి వాయిదా వేశారన్నారు. 2021లో విడుదల చేసిన జీవో 125 ద్వారా మార్గదర్శకాలు ఇచ్చారని వివరించారు. అందులోని కొన్ని సమస్యలనైనా పరిష్కరించాలంటూ మున్సిపల్ పరిపాలనా విభాగం అధికారికి ఎస్టీయూ తరపున విన్నవించామని పేర్కొన్నారు. బదిలీలకు జూన్ 2022 ప్రామాణికంగా తీసుకోవాలని, ప్రధానోపాధ్యాయులకు జీతాలు డ్రాయింగ్ పవర్, ఉపాధ్యాయులకు పీఎఫ్ అక్కౌంట్లు తెరవాలని అన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో చివరి పనిదినం రోజున అన్ని డిప్యుటేషన్లు రద్దయ్యాయని పేర్కొన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో డిప్యూటేషన్లు వెంటనే రద్దు చేయాలని కోరారు.

‘హోమిభాభా’తో ఏపీ ప్రభుత్వం ఒప్పందం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మారుమూల గ్రామాల్లో క్యాన్సర్‌ను నిర్మూలించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగాన్ని విస్తృత పరిచేందుకు రాష్ట్రంలో సమగ్ర క్యాన్సర్ సరంక్షణ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. ఈ మేరకు ఇప్పటికే విశాఖలో పరిశోధన చేస్తున్న హోమిభాభా క్యాన్సర్ రీసెర్చ్ సెంటర్‌తో రాష్ట్ర ప్రభుత్వం పలు ఒప్పందాలు చేసుకుంది. శనివారం ఓ హోటల్లో జరిగిన సదస్సులో కృష్ణబాబు పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగా గుర్తించి, గ్రామ స్థాయిలో నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిల్లో సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అధ్వర్యంలో ఒక్కొక్క సెంటర్‌కు రూ.500 కోట్ల పెట్టుబడితో 11 వైద్య కళాశాలల్లో నాణ్యమైన సదుపాయాలు అందించేందుకు 45 సెంటర్లను గుర్తించామన్నారు. ఎటువంటి క్యాన్సర్ రోగ అయినా 50 కిలో మీటర్ల దూరంలో వైద్యం అందుకునేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఏటా రూ.400 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ రోగుల కోసం ఖర్చు చేస్తోందని తెలిపారు. టాటా మెమోరియల్ ఆస్పత్రి డైరెక్టర్ ప్రమేష్ మాట్లాడుతూ తమ సంస్థలో రోగులకు నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించడంతో పాటు మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. హోమిభాభా క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేష్ మహంతి శెట్టి మాట్లాడుతూ మెడికల్, సర్జికల్, అంకాలజీ, పాథాలజీ వంటి విభాగాల్లో అనేక విజయాలు సాధిస్తున్నామన్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాలతో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తున్నామని తెలిపారు. అడ్వాన్స్ సెంటర్ ఫర్ ట్రీట్మెంట్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్ గుప్తా మాట్లాడుతూ క్యాన్సర్‌ను ఆధునిక టెక్నాలజీతో రూపుమాపేందుకు ఎన్నో వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

రిమ్స్ దొంగ అరెస్ట్

విశాలాంధ్ర-కడప క్రైం: ఇటీవల కడప రిమ్స్ హాస్పిటల్‌లో ఒక మహిళకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆమె మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన కేసులో కడప శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఘరానా దొంగ వేముల మణిదీప్ అలియాస్ మణిని అరెస్ట్ చేసి అతని నుంచి రూ.10 లక్షలు విలువ చేసే 22 తులాల బంగారు నగలు, డాక్టర్ దుస్తులు స్వాధీనం చేసుకున్నట్లు కడప జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. కడప పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో కోవిడ్ సమయంలో కోవిడ్ విభాగంలో ఎంఎన్ఓగా పనిచేసిన అనుభవంతో మత్తుమందుల గురించి పరిజ్ఞానం పెంచుకుని సులువుగా డబ్బు సంపాదించాలని మణి ఈమోసాలకు పాల్పడినట్లు చెప్పారు. డాక్టర్ డ్రెస్సులు వేసుకొని వార్డులోకి వెళ్లి డాక్టర్ అని చెప్పి మత్తు ఇంజక్షన్ ఇచ్చేవాడని తెలిపారు. 2020 ఏప్రిల్ నెల మొదటివారంలో రిమ్స్ హాస్పిటల్‌లో బత్తల లత అనే మహిళకు మత్తుమందు ఇంజక్షన్ ఇచ్చి 20 గ్రాముల బంగారం దొంగిలించాడన్నారు. 2022 ఏప్రిల్‌లో నిమ్మకాయల బాలిరెడ్డి అనే కుటుంబ సభ్యులతో పరిచయం పెంచుకొని వారికి చెందిన 15 తులాలు బంగారు తీసుకుని నాలుగు లక్షల రూపాయలకు కుదువపెట్టి వచ్చిన డబ్బుతో జల్సాలు చేశాడని వివరించారు. 2022 మేలో రిమ్స్ హాస్పిటల్ ఇన్‌పేషెంట్ బ్లాక్‌లోని మొదటి ఫ్లోర్లో ఉన్న కంటి వార్డులోకి వెళ్లి ఎర్రగుడిపాడుకు చెందిన రామగిరి కేశవ లక్ష్మమ్మ అనే ఆమెకు మత్తుమందు ఇచ్చి 22 గ్రాముల బంగారం దొంగిలించినట్లు తెలిపారు. జూన్ 7న బ్రహ్మంగారి మఠానికి చెందిన బసిరెడ్డి విజయలక్ష్మికి మత్తు ఇంజక్షన్ వేసి 30 గ్రాముల బంగారం దొంగిలించినట్లు వివరించారు. కడప డీఎస్పీ వెంకటశివారెడ్డి అధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ సదాశివయ్య, ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, సబ్ డివిజన్ ఐడీ పార్టీతో కలిసి కడప టీటీసీ సర్కిల్ వద్దకు వెళ్లగా అక్కడ హాస్పిటల్ వైపు వెళ్లే బైపాస్ రోడ్డులో నిందితుడు బ్యాగు పట్టుకుని ఉండగా, పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశాడు. అతడిని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. మణి అరెస్టులో పాల్గొన్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ వారికి రివార్డులు అందజేసి అభినందించారు.



చిరుత దాడిలో 15 గొర్రె పిల్లల మృతి

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: అనంతపురం జిల్లా కుందుర్పి మండల కేంద్రంలో శనివారం జరిగిన చిరుత దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. రోజులానే గొర్రెలను యజమాని కురువ లింగన్న మేత కోసం అడవికి తీసుకెళ్లాడు. గ్రామ శివారులోని గొర్రెల గూడును ఏర్పాటు చేసుకున్నాడు. గొర్రె పిల్లలు ఉన్న దొడ్డిపై ఒక్కసారిగా చిరుత దాడి చేసి 15 పిల్లలను చంపేసింది. వీటి విలువ సుమారు రూ.లక్ష దాకా ఉంటుందని యజమాని తెలిపారు. జీవాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్న అతడిపై ఈ ఘటన బాధాకరమని ఆ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అటవీ అధికారులు చర్యలు తీసుకొని మూగజీవాలపై దాడులను అరికట్టాలని వారు పేర్కొన్నారు.

ఆరోగ్యానికి వెచ్చిస్తున్న ప్రతి పైసా కేంద్రానిదే

కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవార్

విశాలాంధ్ర-గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల ఆరోగ్యానికి వినియోగిస్తున్న ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వ సహకారంతో జరుగుతున్నదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవార్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ అధ్యక్షతన శనివారం పదాధికారుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు. కేంద్ర పథకాలు సరైన రీతిలో అందే విధంగా చూడవలసిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.

ఆయుష్ మాన్ భారత్‌తో దేశమంతా వైద్యం అందుతుందని, రూ.5 లక్షల బీమాను రాష్ట్రంలో రూ.2 లక్షలు మాత్రమే ఇవ్వడం సరైంది కాదన్నారు. మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, దేశ వ్యాప్తంగా 25 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరవడం జరిగిందని, ఉజ్వల గ్యాస్ యోజన ద్వారా 8 కోట్ల మంది మహిళలకు లబ్ధిచేకూరిందన్నారు. కోవిడ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామనీ, 190 కోట్ల వాక్సినేషన్‌తో ప్రపంచంలో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. కిసాన్ సన్మాన యోజన ద్వారా 12 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. సబ్ క సాత్ సబ్ కా వికాస్ సబ్ కా విస్వాస్ నినాదంతో ముందుకు వెళ్ళుతున్నట్లు వెల్లడించారు. పాకా సత్యనారాయణ, మాగంటి సుధాకర్ యాదవ్, యడ్లపాటి రఘునాధబాబు, జూపుడి రంగరాజు, చందు సాంబశివరావు, తాళ్ల వెంకటేష్ యాదవ్, దారా సాంబయ్య, బొల్లాప్రగడ శ్రీదేవి, రాచుమల్లు భాస్కర్, అప్పిశెట్టి రంగా, గారపాటి పూర్ణ, అమ్మిశెట్టి ఆంజనేయులు, దీపికా రెడ్డి, నమ్రత చౌదరి, అనుమోలు ఏడుకొండలు, ఉయ్యాల శ్యాంవరప్రసాద్, పాలపాటి రవికుమార్, వనమా సరేంద్ర, ఈదర శ్రీనివాసరెడ్డి, యశ్వంత్, రంగవల్లి, ప్రశాంతి, కరుణశ్రీ, రేణుకాదేవి పాల్గొన్నారు.

టీచర్ల సర్దుబాటు

ఉత్తర్వులు సవరించండి

ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ పోస్టుల తగ్గింపుపై ఉన్న ధ్యాస, విద్యార్థుల ప్రమాణాలు పెంపుదలకు అవసరమైన ఖాళీల భర్తీపై లేదని, వెంటనే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జీవోతో వేలాది ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారుతాయన్నారు. వివిధ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులు సైతం రద్దవుతాయని, ఉపాధ్యాయులకు 32 పిరియడ్ల నుంచి 48కి పెంచడం వల్ల లాభం కంటే, నష్టం జరుగుతుందని తెలిపారు. గత ప్రభుత్వం టీచర్ల రేషనలైజేషన్‌పై ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలిసి 10 మందితో కమిటీ వేసి ఆ కమిటీ సిఫార్సులకు అనుగుణంగా జీవో 29 విడుదల చేసిన విషయం గుర్తు చేశారు. ఎవరితోనూ చర్చించకుండా, అభిప్రాయాలు స్వీకరించకుండా 117 జీవో విడుదల వలన విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ దత్తత గ్రామాల్లో సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ దత్తత గ్రామాలైన ఐనవోలు, శాఖమూరు, వెలగపూడిలో విద్యార్థులకు ఉచిత సమ్మర్ స్పోర్ట్స్ కోచింగ్ క్యాంపును ఎంఈవో గద్దె కోటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో దోహదపడతాయని, విద్యార్థులు ప్రతిరోజు రెండు గంటలపాటు వ్యాయామం చేయాలని సూచించారు. వీసీ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ క్రీడలతో నాయకత్వ లక్షణాలు, ప్రతిభ పెంపొందుతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు బ్రెడ్, పాలు, కోడిగుడ్డు, అరటి పండు అందిస్తున్నామన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు అధ్వర్యంలో ఈనెల 21 వరకు కోచింగ్ క్యాంపు నిర్వహిస్తామని చెప్పారు. బాస్కెట్ బాల్, వాలీ బాల్, కబడ్డీ, యోగా, అథ్లెటిక్స్, త్రోబాల్, కరాటే, ఫుట్ బాల్, బాడ్మింటన్ క్రీడలలో ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు శిక్షణ ఇస్తామన్నారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ నంబూరు అనుపమ మాట్లాడుతూ మూడేళ్లలో ఎంతో మంది విద్యార్థులు తమ క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకున్నట్టు చెప్పారు. ఇప్పటివరకు 1727 మంది లబ్ధి పొందారని వివరించారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామచంద్రరావు, కార్తీక్ ప్రకాశ్, కోచ్‌లు పాల్గొన్నారు.

4 గంటల్లో కిడ్నాప్ కేసు ఛేదన

- పోలీసుల అదుపులో కిడ్నాపర్లు
- బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: మీ బిడ్డను కిడ్నాప్ చేశాం.. రూ. 50 లక్షలు ఇవ్వండి లేకపోతే చంపేస్తామంటూ కిడ్నాపర్లు ఫోన్లో బెదిరించిన సంఘటన పట్టణంలో సంచలనం సృష్టించింది. ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు కిడ్నాప్ అయిన 4 గంటల్లోనే బాలుడిని కిడ్నాపర్ల చెర నుంచి రక్షించి తల్లిదండ్రులకు అప్పగించి పొలిస్ వ్యవస్థ పనితీరు సెబాష్ అని నిరూపించుకున్నారు. హై అలెర్ట్ యాప్ ద్వారా జిల్లా వ్యాప్తంగా పోలీసులను అలెర్ట్ చేసిన ఎస్పీ పక్కీరప్ప జిల్లా వ్యాప్తంగా వెహికల్ చెకింగ్ ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలు కిడ్నాపర్ల కోసం జల్లెడ పట్టాయి. కేసు ఛేదనలో ప్రత్యేక చొరవ చూపి యాడికి మండలం పుప్పాల గ్రామస్తుల సహకారంతో చాకచక్యంగా కిడ్నాప్ కు గురైన బాలుడిని రక్షించారు.

అనంతపురం శారదానగర్‌లో నివాసముంటున్న బట్టల దుకాణం యజమాని షేక్ బాబా వలి కొడుకు సూరజ్ (9) ను కిడ్నాప్ చేసినట్లు అగంతకుడి నుండి బాలుడి తండ్రికి శుక్రవారం సాయంత్రం 6.15 గంటల సమయంలో ఫోన్ కాల్ వచ్చింది. మీ బాబును కిడ్నాప్ చేశాం, రూ. 50 లక్షలు ఇవ్వాలని లేకపోతే చంపుతామని అగంతకులు ఫోన్ లో బెదిరింపులు చేశారు. రూ. 50 లక్షలు ఒక్కడివే టూవీలర్ లో తీసుకురావాలని మరోసారి ఫోన్ చేశారు. ఈవిషయం రాత్రి 7 గంటల సమయంలో ఎస్పీ దాక్టం పక్కీరప్ప కాగినెల్లి దృష్టికి వెళ్లింది. జిల్లాలో పోలీసులను హై అలెర్ట్ యాప్ ద్వారా అలెర్ట్ చేసి వెహికల్ చెకింగ్ కు ఆదేశాలు జారీచేశారు.అనంతపురం ఇన్చార్జి, ట్రాఫిక్, తాడిపత్రి డీఎస్పీలు ఆర్ల శ్రీనివాసులు, ప్రసాదరెడ్డి, చైతన్య, సీఐలు రవిశంకర్ రెడ్డి, కత్తి శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్, ఎస్సైలు కిరణ్ కుమార్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు, 100 మంది సిబ్బందిని రంగంలోకి దించి జల్లెడ పట్టారు. శుక్రవారంరాత్రి సుమారు 11.30 గంటల సమయంలో యాడికి పోలీసు స్టేషన్ పరిధిలోని ముప్పాల-వెంగన్నపల్లి మధ్య పొలాల్లో ఉన్న కిడ్నాపర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి చెరలో ఉన్న బాలుడిని రక్షించారు. కిడ్నాపర్లు అనంతపురం నవోదయ కాలనీకి చెందిన షేక్ నభీరసూల్, లక్ష్మీకాంత్‌లుగా గుర్తించారు. వారి నుంచి టూవీలర్, 2 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు గ్రానైట్ కార్మికులుగా పని చేస్తున్నారు. అప్పులపాలై వాటిని తీర్చుకోవాలని కిడ్నాప్‌నకు ఒడిగట్టినట్లు విచారణలో వెల్లడైంది. నిందితుల్లో ఒకరైన లక్ష్మీకాంత్ గతంలో కమలానగర్‌లో షేక్ బాబావలీ నిర్వహిస్తున్న స్టైల్ జెంట్స్ షో రూంలో పనిచేసేవాడు. ఈ క్రమంలో డబ్బు కోసం బాలుడిని కిడ్నాప్ చేసి షేక్ బాబావలీని డిమాండ్ చేయాలని నిందితులిద్దరూ భావించి కార్యాచరణకు దిగారు.

బైరవనగర్‌లో స్నేహితులతో కలసి ఆడేందుకు వెళ్లిన సూరజ్ ను పథకం ప్రకారం టూవీలర్ లో తీసుకెళ్లిన కిడ్నాపర్లు ముప్పాల- వెంగన్నపల్లి సమీప పొలాల్లో పోలీసులకు చిక్కారు. కొడుకును సురక్షితంగా అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రత్యేక బృందాలను, సిబ్బంది భూపతిరాజు, రాము, రంగస్వామిలను ఎస్పీ అభినందించారు.

అంకితభావంతోనే వైద్య వృత్తిలో రాణింపు

వైద్యవిద్యార్థుల ‘వైట్‌కోట్’ ధారణలో శ్రీభరత్

విశాలాంధ్ర- మధురవాడ: వైద్య వృత్తిలో రాణించాలంటే అంకితభావంతో పాటు ఎన్నో అగ్నిపరీక్షలు తట్టుకుని నిలవాలని, స్వీయ ప్రతిభను పెంపొందించుకోవాలని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న గీతం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వైద్య కళాశాలలో మెడికల్ యూజీ, పీజీ విద్యార్థులకు శనివారం నిర్వహించిన "వైట్‌కోట్ ధారణ" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైద్య విద్యలో ఉన్నత ప్రమాణాలను నెలకొల్ప డానికి అత్యాధునిక ఆస్పత్రితో పాటు 250 మందికి పైగా బోధనా సిబ్బందితో అంతర్జాతీయ ప్రమాణాలతో గీతం వైద్య కళాశాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విద్యతో పాటు సంస్కృతి సంప్రదాయాలను పరస్పరం అర్థం చేసుకుని ఎదగాలన్నారు. జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి మాట్లాడుతూ, వైద్య విద్యార్థులు ఆస్పత్రిలో చేరే ప్రతి రోగిని ఓర్పుతో సమగ్రంగా పరిశీలించి చికిత్స అందించాలన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ వారియర్ మాట్లాడుతూ, వైద్య విద్యార్థులు ఇంజనీరింగ్, ఫార్మసీ, సైన్స్, మేనేజ్‌మెంట్ వంటి కోర్సులు అభ్యసించే వారితో మమేకం కావాలన్నారు. వారి ఆలోచనలు పంచుకోవడం కొత్త ఆవిష్కరణలకు దారితీస్తుందన్నారు. జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతిపద్మజ మాట్లాడుతూ, దేశంలో16 రాష్ట్రాలకు చెందిన వారు ప్రస్తుత విద్యాసంవత్సరంలో గీతం వైద్య కళాశాలలో ప్రవేశం పొందారని తెలిపారు. వైద్య విద్యార్థులకు నిరంతరం సహకరించడానికి అధ్యాపకులు అందుబాటులో ఉంటారని వారి ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చునన్నారు. జిమ్‌సర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.జి.రామాంజనేయులు ఆస్పత్రిలో సదుపాయాలను వివరించారు. నూతనంగా ప్రవేశం పొందిన వైద్య విద్యార్థులకు గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ తెల్లకోటు అందజేశారు. అనంతరం వైద్య వృత్తి పట్ల నిబద్ధతతో, విలువలతో వ్యవహరిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

సంపాదకీయం

ప్రజల ప్రమేయం లేని ఎన్నికల్లో అనవసర హడావుడి

ఈ దఫా రాజ్యసభ ద్వైవార్షిక ఎన్నికల్లో 15 రాష్ట్రాల నుంచి భర్తీ చేయాల్సిన సీట్లు 57. అందులో ఎనిమిది రాష్ట్రాల నుంచి 41 మంది ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు. ఇక మిగిలింది నాలుగు రాష్ట్రాలలో 16 స్థానాలకే. ఇంతదానికే ఈ ఎన్నికల క్రమంలో పెద్ద హడావుడి, ఆరోపణలు ప్రత్యారోపణలు, ఒక పార్టీకి చెందిన వారు కట్టు తప్పి మరో పార్టీకి ఓట్లు వేయడం, శాసనసభ్యులు ఎక్కడ గోడ దూకుతారోనన్న భయంతో వారిని విలాసవంతమైన అతిథి గృహాల్లో విడిది చేయించడం మొదలైనవన్నీ అక్కరలేని ఆసక్తి రేకెత్తించాయి. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలలోని శాసనసభ్యులు మాత్రమే ఓటు వేసే ఈ ఎన్నికలకు ఇంత హడావుడి ఏమిటో, ఇది మన ప్రజాస్వామ్య చైతన్య శీలతకు ప్రతీకో, సకలవిధ ఉపాయాలు వినియోగించుకుని రాజ్యసభ సీటు దక్కించుకోవాలన్న పట్టుదలో, ఆ స్థానం దక్కితే ఒనగూడే లాభాల వల్లో కారణం ఏమైనా పోటీ మాత్రం తీవ్రంగానే జరిగింది. ఓటు వేసేది శాసన సభ్యులైనప్పటికీ వారు వేసిన ఓట్లూ చెల్లకుండా పోవడం మరో వైపరీత్యం. ఇద్దరు కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్ కూడా రంగంలో ఉండడం అత్యుత్సాహానికి ఇంకో కారణమైంది. ఒక్కో రాజ్యసభ సీటు గెలవడానికి ఏ రాష్ట్రంలో ఎంత మంది శాసనసభ్యుల మద్దతు కావాలో ముందే తెలిసినా ఏదో పార్టీకి అవసరానికి మించిన ఓట్లు ఉంటే గెలిచే శక్తి లేకపోయినా అదనంగా అభ్యర్థులను రంగంలోకి దింపడం పరిపాటి అయింది. నిజానికి రాజ్యసభ అంటే రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే సభ. అంటే ఎవరి సొంత రాష్ట్రం నుంచి వారే పోటీ చేయాలి. కానీ ఈ నియమానికి ఎప్పుడో స్వస్తి చెప్పారు. ఈ వెసులుబాటు కోసం చట్టాన్ని కూడా సవరించేశారు. ఎగువ సభ రాజకీయ నిరుద్యోగులకు నెలవు అయిపోయిందన్న విమర్శలు మొదలై చాలా కాలమైంది. ఈ రుగ్మతకు తోడుగా సంపన్నులు ఎమ్మెల్యేలను కొనడానికి డబ్బు సంచులు పట్టుకొచ్చి విచ్చలవిడిగా పంచేసి రాజ్యసభ సభ్యులైపోతున్నారు. ఇలా తాపత్రయపడే వారిలో పారిశ్రామిక వేత్తలు, సినీ రంగ ప్రముఖులు, మీడియా అధిపతులు ఉంటున్నారు. రాజస్థాన్ నుంచి జీ న్యూస్ మీడియా సంస్థ అధిపతి సుభాష్ చంద్ర తగినంత మంది ఎమ్మెల్యేల మద్దతు లేదని తెలిసినా రంగంలోకి దిగారు. బీజేపీ ఆయనకు మద్దతిచ్చింది. కానీ ఆయనకు చుక్కెదురైంది. మరో మీడియా సంస్థ ఐ న్యూస్ అధిపతి కార్తికేయ శర్మ మాత్రం హర్యానా నుంచి బీజేపీ దన్నుతో ఇండిపెండెంటుగా ఎన్నికయ్యారు. ఆయన విజయం కాంగ్రెస్‌కు విఘాతమే. అజయ్ మాకెన్ కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలో దిగి భంగపడ్డారు. 31 ఓట్లు చేతిలో ఉన్నా అజయ్ మాకెన్ ఓటమి పాలయ్యారంటే మీడియా అధిపతి ప్రభావం ఎంత శక్తిమంతమైందో చెప్పక్కర్లేదు. కార్తికేయ శర్మకు గొప్ప చరిత్రే ఉంది. ఆయన మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకుడు వినోద్ శర్మ కుమారుడు. మరో కాంగ్రెస్ నాయకుడు కుల్దీప్ శర్మకు అల్లుడు. అన్నింటికన్నా మించి జెస్సికా లాల్ హత్య కేసులో నేరస్థుడని తేలిన మను శర్మ తమ్ముడు. మీడియా అధిపతి సుభాష్ చంద్ర 2016లో బీజేపీ మద్దతుతో హర్యానా నుంచి ఎన్నిక కాగలిగారు. కానీ ఈసారి రాజస్థాన్ నుంచి పోటి చేసినా ఆయన ఆశ నెరవేరలేదు. రాజ్యసభ సభ్యత్వం ఉంటే తమ వ్యాపారాలకి అనువుగా ఉంటుందన్న నమ్మకం చాలామంది పారిశ్రామికవేత్తలకు, సంపన్నులకు, మీడియా అధిపతులకు, వివిధ కళా రంగాలలో ఉన్న వారికి ఎప్పుడో అర్థం అయింది. అందుకే డబ్బు వెదజల్లి అయినా రాజ్యసభలో ప్రవేశించడం కోసం నానా యాతన పడ్తున్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన వారిలో 11 మంది ఉత్తరప్రదేశ్ వారు. వీరిలో ఎనిమిది మంది బీజేపీ అభ్యర్థులు. సమాజ్ వాదీ పార్టీ, రాష్ట్రీయ లోక్ దళ్ తరఫున ఒక్కొక్కరు ఎన్నికైతే కాంగ్రెస్‌కు ఈ మధ్య రాజీనామా చేసి సమాజ్ వాదీ పార్టీ సహకారంతో ఎన్నికైన కపిల్ సిబ్బల్ కూడా ఉన్నారు. బిహార్‌లో జె.డి.(యు) సభ్యులు ఒకరు, బీజేపీ సభ్యులు ఇద్దరు, ఆర్.జె.డి. సభ్యులు ఇద్దరు ఏకగ్రీవంగానే ఎన్నికయ్యారు. జార్ఖండ్‌లో ఇద్దరు, ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు, ఒరిస్సాలో ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు, తెలంగాణలో ఇద్దరు, తమిళనాడులో ఆరుగురు, మధ్యప్రదేశ్‌లో ముగ్గురు, పంజాబ్‌లో ఇద్దరు పోటీ లేకుండానే ఎన్నికయ్యారు. అంటే పదకొండు రాష్ట్రాల ఎన్నికల్లో ఆసక్తికర, ఆశ్చర్యకర అంశాలు ఏమీ లేవు. నాలుగు రాష్ట్రాలలో మాత్రమే రాజ్యసభ ఎన్నికల క్రమం రసభరితంగా జరిగింది. మూడు రాష్ట్రాలలో బీజేపీ కాంగ్రెస్ మీద విజయం సాధించింది. రాజస్థాన్‌లో మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియాకు సన్నిహితురాలైన శాసన సభ్యురాలు శోభా రాణీ కుష్వాహ క్రాస్ ఓటింగుకు పాల్పడడం బీజేపీ ఎన్నికల నిర్వహణా సామర్థ్యానికి మచ్చగానే మిగిలిపోతుంది. కర్నాటకలో బీజేపీ పోటీకి పెట్టిన ముగ్గురు అభ్యర్థులూ విజయం సాధించారు. కర్నాటకలో ప్రతిపక్ష శిబిరంలో లుకలుకలు బీజేపీ విజయానికి తోడ్పడ్డాయి. ప్రతిపక్ష జె.డి. (ఎస్) ఎమ్మెల్యే కె. శ్రీనివాస గౌండ క్రాస్ ఓటింగుకు పాల్పడ్డారు. అదేమిటంటే కాంగ్రెస్ తనకు ఇష్టం అని సమర్థించుకున్నారు. కర్నాటక నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జై రాం రమేశ్ అనుకున్నట్టే గట్టెక్కారు. హర్యానాలో ముఖ్యమంత్రి భూపేంద్ర సింగ్ హుడా మాట చెల్లలేదు. కాంగ్రెస్ శాసన సభ్యుడు కుల్దీప్ బిష్ణోయ్ "అంతరాత్మ సాక్షిగా" ఓటు వేస్తానని బహిరంగంగానే చెప్పడం హుడాను ధిక్కరించడమే. మహారాష్ట్రలో ఆరు స్థానాలకు ఎన్నికలు జరిగితే అధికారంలో ఉన్న శివసేన, ఎన్.సి.పి., కాంగ్రెస్‌తో కూడిన మహా వికాస్ అగాధాకు మూడు సీట్లు దక్కాయి. ఒక్కో భాగస్వామ్య పక్షం ఒక్కో సీటు సాధించాయి. బీజేపీ మూడు స్థానాల్లో గెలవడం చెప్పుకోదగ్గ విజయమే. అధికార కూటమిలో పొరపొచ్చాల కారణంగానే తాము మంచి ఫలితాలు సాధించగలిగామని మహారాష్ట్రలో బీజేపీ వ్యవహారాల పర్యవేక్షకుడు బి.ఎ. సంతోష్ అన్నారంటే దేవేంద్ర ఫడ్నవిస్ చాకచక్యం సామాన్యమైంది కాదు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ మూడో స్థానం గెలుస్తుందా అన్న అనుమానాలు ఉండేవి. కానీ మూడు స్థానాలు దక్కించుకోవడం కాంగ్రెస్‌కు ప్రోత్సాహకరమైందే. రాజ్యసభలో సత్వరం మెజారిటీ సాధించాలని తహతహలాడుతున్న బీజేపీ బలం 95 నుంచి 93కు తగ్గింది. 29 మంది సభ్యులున్న కాంగ్రెస్ బలంలో మార్పు లేదు. జులై 18న రాష్ట్రపతి పదవికి ఎన్నిక జరగాల్సి ఉంది కనక రాజ్యసభలో బలాబలాలకు ప్రాధాన్యత ఉంటుంది. కర్నాటకలో ప్రతిపక్షం అయిన జె.డి. (ఎస్) ఈ ఎన్నికల్లో ఒక్క సీటైనా గెలవలేదు. ఇది కర్నాటక ప్రతిపక్ష శిబిరంలో అనైక్యతకు చిహ్నం.

అందమైన బాల్యానికి ఆసరా ఏదీ?

యండి. ఉస్మాన్ ఖాన్

బాల్యం ఓ అందమైన కల.. ఆనందాల అల.. అపురూపమైన మధురానుభూతి. గడచిపోయిన అందమైన బాల్యం మళ్లీ తిరిగొస్తే బావుండు అని అనుకోని వారెవరైనా ఉంటారా.! అందుకే 'నా సర్వస్వం మీకిచ్చేస్తా... నా బాల్యం నాకు ఇచ్చేస్తారా.?' అన్నారు సి నా రె. కానీ ప్రస్తుతం సమాజంలో బాల్యం ఎందరికో భారంగా మారింది. అనేక కారణాలవల్ల కొన్ని బాల్యాలు చీకట్లలోనే మగ్గుతున్నాయి. పలకా బలపం పట్టి బుడి బుడి నడకలతో సందడి చేయాల్సిన పసివాడని పసిచేతులు కార్ఖానాల పాలవుతున్నాయి. చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారు. ఆడిపాడాల్సిన వయస్సులో నాలుగు గోడల మధ్య బందీ అవుతున్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఐక్యరాజ్యసమితి ప్రత్యేక విభాగమైన అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2002లో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినాన్ని ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా బాలకార్మికుల దయనీయ స్థితిని గుర్తించి, వారి జీవితాలను బాగుపరచడం కోసం బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం జరుపుకుంటున్నారు.

ఎంతోమంది చిన్న పిల్లలు హోటళ్ళలో, రెస్టారెంట్లలో, మెకానిక్ షెడ్లలో, గ్యారేజీల్లో, కర్మాగారాలు, పరిశ్రమల్లో వెట్టిచాకిరీ చేస్తూ, యజమానుల ఇళ్ళలో గొడ్డుచాకిరీ చేస్తూ, రోడ్లపై కాగితాలు, ప్లాస్టిక్కూ, గాజు సీసాలు ఏరుకుంటూ.. తగినంత వేతనం కాని, కడుపునిండా తిండి గాని, తగిన సదుపాయాలుగాని లేక నిస్సహాయ స్థితిలో దారుణంగా నలిగిపోతున్నారు. ఉపాధి లేని వాళ్ళుగా, ముష్టివాళ్ళుగా మారిపోతున్నారు. మరో దురదృష్టకరమైన, భయంకర వాస్తవం ఏమిటంటే, కొంతమంది అమాయక పసి బాలికలు అతి చిన్నవయసులోనే బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెట్టివేయబడుతున్నారు. ఈ అమాయక ప్రాణులు అలాంటి మురికి కూపాల్లో పడకుండా ఎవరు రక్షించాలి? పడిన వారిని ఎవరు బయటికి తీయాలి? వీరిని ఎవరు ఆదరించాలి? పేదరిక నిర్మూలనకు పకడ్బందీ ఏర్పాట్లతో పాటు, సంపూర్ణ అక్షరాస్యతకు చిత్తశుద్ధితో కూడిన ఆచరణాత్మక చర్యలు చేపడితే తప్ప ఈ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన సమస్యకు పరిష్కారం లభించదు.

పిల్లలకు చదువు ద్వారానే మంచి భవిష్యత్తు దక్కుతుందన్న విశ్వాసాన్ని, తద్వారా పిల్లల చదువుకోసం ఒక బలమైన కోరికను తల్లిదండ్రుల్లో రగిలించాలి. బాల కార్మిక సమస్య నిర్మూలనకు ఇదొక్కటే సరైనమార్గం. పని మాన్పించి పిల్లల్ని పాఠశాలలో చేర్పించాలనే ఉద్యమం కంటే ముందు, అసలు ఏ బిడ్డా పని చెయ్యకూడదని సమాజాన్ని అంగీకరింపజేయాలి. తల్లిదండ్రుల్ని ఒప్పించాలి. పిల్లలు బాగుంటేనే దేశ భవితవ్యం బాగుంటుంది. దశాబ్దాలుగా ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా బాల కార్మిక వ్యవస్థ రోజు రోజుకు పెరిగిపోయింది. ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించి భావి భారత పౌరుల బంగారు భవిష్యత్తుకు శ్రీకారం చుట్టేందుకు ప్రభుత్వాలు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. బాల కార్మిక (నిషేధ, నియంత్రణ) చట్టం 1986 లోని సెక్షన్-3 ప్రకారం 14 ఏళ్ల లోపు బాల బాలికలతో పని చేయించడం నేరం. సెక్షన్-14 ప్రకారం బాలలతో పని చేయించిన యజమానులకు ఒక సంవత్సరం వరకు గరిష్ఠ జైలు శిక్ష, రూ. 20 వేలు జరిమానా కూడా విధించవచ్చు. రెండోసారి ఇదే నేరం చేస్తే రెండేళ్ల వరకు గరిష్ఠ జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుంది. బాలకార్మిక వ్యవస్థపై జిల్లా, రాష్ట్ర కార్మిక అధికారులకు ఫిర్యాదు చేయాలి. మండల తహసీల్దారుకు, ఆర్డీవో, కలెక్టర్‌లకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఫ్యాక్టరీల చట్టం-1948, గనుల చట్టం-1952, వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన చట్టం 1976, కాంట్రాక్ట్ కార్మిక (నియంత్రణ, నిర్మూలన) చట్టం 1970ల ప్రకారం బాలలతో పని చేయించడం నేరం. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విభాగంలో ప్రొఫెసర్ బిల్మోరియా 1996లో జూన్‌లో చైల్డ్‌లైన్ స్థాపించి కుటుంబ, పిల్లల సంక్షేమ విభాగం ద్వారా నిర్వహిస్తూ బాలలకు సేవలందిస్తున్నారు. 1998లో సామాజిక న్యాయం సాధికారిత మంత్రిత్వ శాఖ, మహిళా, బాలల సంక్షేమ మంత్రిత్వ శాఖలు చైల్డ్‌లైన్‌కు సహకారం అందిస్తున్నాయి. ప్రతి ఒక్కరు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తమ వంతు కృషి చేయాలి.

నేడు అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం
వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు

మౌలికాంశాలు మరచి మౌలిక వసతులా...!

డా. యం. సురేష్ బాబు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ విద్యారంగంలో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. నగదు బదిలీ రూపంలో 'అమ్మ ఒడి' పథకం అమలు చేస్తున్నారు. 'జగనన్న విద్యా కానుక' అంటూ పిల్లలకు అవసరమైన సామాగ్రి అందించారు. దానికి తోడుగా 'నాడు- నేడు' పేరుతో పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దారు. రాష్ట్రంలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి డెమో పాఠశాలలుగా అభివృద్ధి చేస్తుండగా, మొత్తం స్కూళ్లలో మూడోవంతు బడులు కొత్త రూపు సంతరించుకున్నాయి. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల మీద దాని ప్రభావం ఉంటుంది. చదువు అనే అస్త్రంతో పేదరికాన్ని జయించవచ్చు, పిల్లలకు ఇవ్వగలిగే ఆస్తి చదువే. పోటీ ప్రపంచంలో వారి కాళ్లపై వాళ్లు నిలబడడానికి చదువు ఉపయోగపడుతుంది. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయిన మైదానం, దుమ్ము కొట్టుకుపోయిన గోడలు, విరిగిపోయిన వాకిళ్లు, కిటికీలు, పగుళ్లిచ్చిన పైకప్పు, నీళ్లు లేని మరుగు దొడ్లు, కూర్చోవడానికి బెంచీలు కరువు, కిర్రుకిర్రుమని శబ్దం చేసే ఉపాధ్యాయుల చెక్క కుర్చీలు, నాలుగు పరీక్ష నాళికలు సైతం లేని సైన్స్ ల్యాబ్, ఇదీ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొన్నటి దాకా ఉన్న పరిస్థితి. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన బడి నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతున్నాయి. రంగు రంగుల చిత్రాలతో అల్లంత దూరం నుంచే ఆకట్టుకుంటున్నాయి. సకల సౌకర్యాలతో కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా రూపు మార్చుకున్నాయి. ఇప్పటికే చాలా గ్రామాల్లో రూపు మారిపోయి కొత్త శోభ సంతరించుకున్నాయి. పట్టణాల్లో ఉండి సొంత గ్రామాలకు వెళ్లిన వారికి తాను చిన్నప్పుడు చదువుకున్న బడి ఇదేనా అని అబ్బుర పరిచేలా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే కొత్త పథకాల కారణంగా కొందరు విద్యార్థులు ప్రభుత్వ బడుల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంగ్లీష్ మీడియం, నాడు-నేడు నిధులతో ఆధునిక హంగులు సమకూరితే మరింత మంది అటు వైపు మళ్లుతారనే అంచనాలు పెరుగుతున్నాయి. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మారింది ప్రభుత్వ విద్య. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువ శాతం బహుజనుల పిల్లలు. రెక్కాడితే కాని డొక్కాడని వారి పిల్లలు ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసిస్తున్నారు. ఈ సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణులు కాని విద్యార్థులు ఎక్కువ శాతం వెనుకబడిన, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అధికంగా ఉన్నారు. దీనికి ప్రధాన కారణం పిల్లలు ఉత్పత్తి కులాల నుండి వచ్చిన వారు గత రెండు సంవత్సరాలుగా బోధన లేకపోవడం, అలాగే పఠనా సామర్థ్యాలు సన్నగిల్లడం ప్రధాన కారణం. సంవత్సరాల కొద్దీ పుస్తక పఠనం, లేఖనము అలవాటు లేకపోవడం, ఎప్పుడూ ఆన్‌లైన్ క్లాస్. పిల్లలకు

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచి చిన్న చిన్న కథలు చదివి వినిపిస్తుండాలి. బాల సాహిత్యానికి సంబంధించిన ఆసక్తికర పుస్తకాలను కూడా వారి చేత చదివించాలి. ఇలా చేయడం వల్ల పిల్లలు తమకు తెలియకుండానే పుస్తకాల పట్ల ఆకర్షితులవుతారు. పుస్తక పఠనం ద్వారా కొత్త కొత్త పదాలను నేర్చుకుంటారు. కొత్త విషయాల్ని తెలుసుకుంటారు. వాళ్లు పెద్దయ్యేకొద్దీ పుస్తకాలు వారికిచ్చి చదివించడం అలవాటు చేయాలి. పాఠశాల స్థాయిలోనే యువ మేధస్సులను ఉత్తేజపరిచి వారిలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి తద్వారా ప్రతి పాఠశాల నూతన ఆవిష్కరణల వేదికగా రూపొందించాల్సిన ఆవశ్యకత నేటి సాంకేతిక యుగంలో ఎంతైనా ఉంది. ప్రస్తుతం పాఠశాలలో ఉన్న ప్రయోగశాలలు సంప్రదాయ పాఠ్యాంశాలకు అనుగుణంగా రూపొందించినవే కాని ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మాత్రం లేవు. చాలా పాఠశాలల్లో ప్రయోగశాలలే లేవు. ఇంటర్మీడియేట్ కళాశాలల్లో సైతం ప్రయోగశాలలు లేకుండానే ప్రయోగ పరీక్షల్లో మార్కులు వేసి విద్యార్థుల్ని ఏమరుస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం అన్ని ప్రైవేటు పాఠశాలలు జూమ్, మైక్రోసాఫ్ట్, గూగుల్ ఇలా ఏదో ఒక వీడియో కాలింగ్ ప్లాట్ ఫాం ద్వారా పిల్లలకు పాఠాలు బోధించారు. పదో తరగతి విద్యార్థుల పరీక్షలు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆన్ లైన్ తరగతులు నిర్వహించినా ఫలితం లేదు. చాలా వరకు విద్యార్థులకు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ లేకపోవడం, సమాన విద్యావకాశాలు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వెనుకబడ్డారు. ఇక కార్పొరేట్ పాఠశాలల విషయానికొస్తే, దాదాపు విద్యా సంవత్సరం మొదలైనప్పటి నుండి పాఠశాలలు పిల్లలకు ఆన్ లైన్ తరగతులు నిర్వహిస్తున్నాయి. గత రెండు సంవత్సరాలుగా లాక్‌డౌన్ నేపథ్యంలో పిల్లలు పూర్తిగా ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో టీవీలకు, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోతుంటారు. అన్ని రోజుల పాటు పిల్లలు పూర్తిగా చదువుకు దూరమైతే తర్వాత ఇబ్బందులు ఎదుర్కోవాలి, అందుకే వారిని ఏదో రకంగా కాసేపు చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించేందుకు వీడియో కాలింగ్ అప్లికేషన్ల ద్వారా బోధన సాగిస్తున్నారు. ఈ సంవత్సరం వారికి కొత్తగా ఎటువంటి పాఠాలు చెప్పలేదు. పాతవే మరోసారి గుర్తు చేస్తూ వారి సందేహాలను తీర్చే ప్రయత్నం చేశారు. వివిధ రకాల వీడియో కాలింగ్ అప్లికేషన్లను ఉపయోగిస్తూ పాఠాలను బోధించే ప్రయత్నం చేస్తున్నారు. నోట్సులు కూడా స్వయంగా ప్రిపేర్ చేసి వాట్సాప్ ద్వారా షేర్ చేస్తూ పిల్లలకు ఓ రకంగా పాఠశాల జరుగుతోందన్న వాతావరణాన్ని కల్పించారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉన్నంత సౌలభ్యం ప్రభుత్వ పాఠశాలల విషయంలో ఉండదు. అదీగాక ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే ఉంటారు కనుక వీరు పబ్లిక్ బ్రాడ్ కాస్టర్స్ ద్వారానే పాఠాలు చెప్పాలి. చాలా ప్రభుత్వ పాఠశాలల్లో కరెంటు లేదు ఇక డిజిటల్ క్లాసులు కావాలంటే కేబుల్ టీవీ, ఇంటర్నెట్ సదుపాయం, ట్యాబ్ సౌకర్యం పేద మధ్యతరగతి పిల్లలకు ఎలా వస్తుంది. ఆన్ లైన్ బోధన విధానం పేద ధనిక వర్గాలకు చెందిన పిల్లల్లో అంతరాలను పెంచుతుంది. ఆన్‌లైన్ క్లాసులకు పర్యవేక్షణ లేక విద్యార్థులు పెడదారి పడుతున్నారు. ఉత్పత్తి కులాలకు చెందిన పిల్లలు, చిరు వ్యాపారస్తుల, చిల్లర వర్తకులు, సంచార జీవనం జరిపే కుటుంబాలకు చెందిన పిల్లలకు ఆన్‌లైన్ విద్య శాపంగా మారింది. ఇక అధ్యాపకులకు బోధనా సామర్థ్యాలు లేకపోవడం ప్రధాన కారణం. విద్యాబోధనలో ప్రతి ఉపాధ్యాయుడికి విద్యాలక్ష్యాల వర్గీకరణ గురించి గమ్యాలు, ఉద్దేశాలు, లక్ష్యాలు అనే పదాల గురించి అవగాహన ఉండటం ఎంతైనా అవసరం. ఎందుకంటే విద్య అనే త్రిధ్రువ ప్రక్రియలో మొదటి సోపానం బోధనా లక్ష్యాలను రూపొందించడం. రెండో సోపానం అభ్యసనానుభవాలను కల్పించడం, మూడోది ప్రవర్తనా మార్పులను మూల్యాంకనం చేయడం. ఎప్పుడో ముప్పయి సంవత్సరాల క్రిందట ఇంటర్మీడియట్, డిగ్రీలో ఇంగ్లీష్ పేపర్ పాసు కావడానికి బూన్ గైడ్ చదివి ముప్పై ఐదు మార్కులు తెచ్చుకున్న వారు పునశ్చరణ తరగతులు, ఓరియెంటేషన్ లేక ఆంగ్ల మాధ్యమంలో బోధన ఎలా సాధ్యపడుతుంది? ఇక ప్రతి గ్రామంలో, మండలంలో కుల సంఘాలు, అనుబంధ సంఘాల నాయకులకు కొదవలేదు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు 90 శాతం మన వారే అయినప్పుడు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలన్న స్పృహ మన నాయకులకు లేకపోవడం చింతించాల్సిన విషయం. విద్య ద్వారానే తమ జీవితాలు బాగుపడతాయి అన్న డా. అంబేద్కర్ మాటలు నిజం కావాలంటే ప్రభుత్వ బడులు బాగుపడాలి, అందులో బోధనా సామర్థ్యాలు మెరుగుపడాలి, విద్యార్థులు రేపటి పౌరులుగా ఉత్తమ సమాజం వైపు అడుగు వేయాలి.

వ్యాస రచయిత ప్రజా సైన్స్ వేదిక రాష్ట్ర అధ్యక్షులు

ఇవి కేవలం భారతదేశంలోనే జరుగుతాయి!

డాక్టర్ దేవరాజు మహారాజు

నువ్వు చెప్పే విషయం నేను ఒప్పుకోకపోవచ్చు, కానీ నేను చచ్చేదాకా నిన్ను నువ్వు వ్యక్తీకరించుకునే హక్కును మాత్రం సమర్థిస్తూనే ఉంటాను - వోల్టేర్ - ఫ్రెంచ్ రచయిత, చరిత్రకారుడు, తత్త్వవేత్త.

రాలే ఆకులో, జారే చినుకులో, మండే నిప్పులో, వీచే గాలిలో ప్రతి విషయంలో దాక్కుని ఉన్న అంత సూత్రాన్ని అర్థం చేసుకోవడమే సైన్సు. ప్రాయోగిక పరిజ్ఞానంతో, నిరూపణలతో నిలబడేదే సైన్సు. తనను తాను పునరుద్ధరించుకునేదే సైన్సు. అది పాఠ్య పుస్తకాలకు పరిమితం కాకూడదు. నిత్య జీవితంలో ప్రధాన భాగం కావాలి. మనమిప్పుడు ప్రతి అంశాన్నీ వైజ్ఞానిక దృష్టి కోణంతో అవలోకించాల్సి ఉంది. అప్పుడే సహేతుకమైంది ఏదో, అహేతుకమైంది ఏదో గుర్తించగలుగుతాం. దాని వల్ల వేటికి ప్రాధాన్యమివ్వాలో వేటికి ఇవ్వగూడదో అర్థమవుతుంది.

కర్నాటక గవర్నర్ తవర్ చంద్ గెహ్లోట్ ప్రఖ్యాత జోగ్ జలపాతం చూద్దామని వెళ్ళారు. ఆయన వెళ్ళిన సమయానికి అందులో నీరు లేదు. గవర్నర్‌కు నేత్ర పర్వం కలిగించడానికి లింగనమఖి రిజర్వాయరు నుండి 500 క్యూసెక్కుల నీటిని నాలుగు గంటల పాటు జోగ్ జలపాతానికి మరలించారు. అక్కడ కొంతసేపు ఆనందించిన గవర్నర్ తన దారిన తాను వెళ్ళిపోయారు. అసలు విషయమేమంటే అధికారులు గవర్నర్ మెప్పు కోసం విడుదల చేసిన నీటితో రెండు వేల యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అయ్యేది. అసలు ఆ లింగనమఖి రిజర్వాయరు నిర్మించిందే జల విద్యుత్తు కోసం. అధికారంలో ఉన్నవారి మెప్పు కోసం ఈ దేశంలో ఎంత దుర్వినియోగం జరుగుతోందో ఈ సంఘటన ఒక ఉదాహరణ. ఇది భారతదేశంలోని ఒక రాష్ట్ర గవర్నరు విషయం. మరి అలాంటి ఎంతోమంది గవర్నర్‌లపైన ఉన్న ప్రధాని స్థాయి ఎంత ఉన్నతమైందో మనకు తెలుసు కదా?

ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మోరిసన్‌కు సంబంధించి ఒక సంఘటన చూద్దాం. ఎలక్షన్ సమయంలో ఆయన ఒక రెసిడెన్షియల్ ఏరియాలో ప్రజల్ని ఉద్దేశించి మాట్లాడుతున్నాడు. అంతే. ఎదురింట్లోంచి ఆ ఇంటి యజమాని బయట కొచ్చాడు. "మిస్టర్ ప్రైమ్ మినిస్టర్! ఇక్కడ మీరేం చేస్తున్నారో తెలుస్తోందా? నా ఇంటి ముందు లాన్ పాడు చేస్తున్నారు. దయచేసి ఖాళీ చేసి వెళ్ళిపోతే సంతోషం" అని గొంతెత్తి బిగ్గరగా చెప్పాడు. అంతే - ప్రైమ్ మినిస్టర్ స్కాట్ మోరిసన్ వినిపించుకున్నాడు. వెంటనే తన ఉపన్యాస కార్యక్రమం ఆపేసి నిముషాల్లో వెళ్ళిపోయాడు. ఏదో పక్కింటి వాడి మీద కోసం వెళ్ళగక్కినట్టు ఆ ఇంటి యజమాని కోప్పడడం - దేశ ప్రధాని కిమ్మనకుండా వెళ్ళిపోవడం. ఎంత ప్రజాస్వామ్యం? ఎంత నాగరికత? పౌరులకు ఎన్ని హక్కులూ? ఇలాంటి సంఘటన మన దేశంలో సాధ్యమా? అలాంటి మాట ఇక్కడ, ఈ దేశంలో కనీసం వార్డు మెంబరుకు కూడా చెప్పలేం. చెప్పినా అతనేమైనా వింటాడా? తన వెంట ఉన్నవారిని ఉసిగొల్పి ఆ ఇంటి యజమానిని తన్నించి, నోరు మూయిస్తాడు. నాగరిక అనాగరిక దేశాల మధ్య వ్యత్యాసం అలా ఉంటుంది. మానవీయ విలువల్ని నిలుపుకోవడమంటే ఏమిటో మనం ఇంకా నేర్చుకోవాల్సే ఉంది.

ఇక్కడ భారత ప్రధాని, ఆయన అనుచరులు ఏ స్థాయిలో ఉన్నారో చూద్దాం. ఈ పోలిక ఎందుకంటే ఎవరు సహేతుకంగా ఉన్నారు. ఎవరు అహేతుకంగా మాట్లాడుతున్నారో బేరీజు వేసుకోవడానికి మాత్రమే! ఇందులో ఎవరినీ నొప్పించాలని గానీ, ఎవరి మనోభావాలో దెబ్బ తీయాలని గానీ.. కాదు! దేశ ప్రజల ఆకలి, నిరుద్యోగం, ప్రాజెక్టులు, కరోనా నివారణ, రైతులకు కనీస మద్దతు ధర లాంటి అప్రధానమైన విషయాల్ని పక్కన పెట్టి - అతి ప్రధానమైన విగ్రహాల నిర్మాణం చేపట్టిన భారత ప్రధాని కేదార్‌నాథ్‌లో శంకరాచార్య విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 136 కోట్ల దేశ ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చారు. ఆ విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం దాని ముందు కూర్చుని ఆయన 'ధ్యానం' చేశారు. అప్పుడు శంకరాచార్య విగ్రహం నుండి ఒక కాంతి రేఖ ఉద్భవించినట్టు తనకు అనిపించిందనీ - భవ్య భారత దేశాన్ని సాక్షాత్కరింపజేసినట్టు అనిపించిందనీ ప్రధాని మోదీ పత్రికల వారికి తెలి పారు. ఒక నిర్జీవపు రాతి విగ్రహం కాంతి రేఖలు ప్రసరించడం ఎప్పుడు ఎలా సాధ్యమవుతుందోనన్నది వారి అనుచరులెవరైనా పరిశోధిస్తే నోబెల్ ప్రకటిద్దామని స్వీడన్ : స్టాక్‌హోమ్‌లో ప్రైయిజ్ కమిటీ ఆతురతతో ఉన్నట్లుంది. ఇలా భ్రమలూ భ్రాంతుల్లో బతికే వారినా ఈ దేశ ప్రజలు దేశ నాయకులుగా ఎన్నుకున్నారూ? దేశ ప్రజల అజ్ఞానానికి ఎంతో బాధ కలుగుతోంది. అజ్ఞానులు ఎన్నుకునే నాయ కులు అజ్ఞానంలో ఉండక, జ్ఞాన సంపన్నులెలా అవుతారూ? అయోధ్యలో రామా లయం కాదు, ఇప్పటికైనా రామాయణం ఆధారంగా పుష్పక విమానం తయారు చేయించకపోతే అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వెంటనే గద్దె దిగిపోవాలి. దీనిపై మోదీ, షాలు స్పందించాలి అని ప్రతిపక్షంవారు డిమాండ్ చేస్తున్నారు. "పరివార్ పరివార్ - అని తెగ మాట్లాడుతున్నారు కదా? ఏదీ మీ పరివారం? ఏదీ మీ కుటుంబం?" అని కొందరు మోదీని, ఆదిత్యనాథ్‌ను ప్రశ్నించారు. దానికి ఆదిత్యనాథ్ ట్విట్టర్‌లో జవాబిచ్చాడు. "నా రాష్ట్రంలోని 25 కోట్ల మంది ప్రజలు నా పరివారమే" అని అన్నాడు. తన హృదయ వైశాల్యం ఎంతో ప్రకటించాడు. అయితే అది కొద్ది నిముషాలు కూడా నిలువ లేదు. లక్షల మంది ప్రశ్నలు గుప్పిం చారు. "మరి ముస్లింలను ఏం చేస్తావు నాయనా? వాళ్ళు 'అబ్బా జాన్' అంటే నీకు చిర్రెత్తుకొస్తుంది. దళిత అమ్మాయి అయితే అర్ధరాత్రి గుట్టు చప్పుడు కాకుండా కాల్చేయిస్తావు. ఇక యువతీ యువకులెవరైనా తిండి లేదని అన్నా, ఉద్యోగం ఇప్పించమని అన్నా లాఠీలతో వారిని నుగ్గు నుగ్గు చేయిస్తావు.. ఇవికాక, ఇంకా ఎక్కడుంది నీ పరివారం?" - అని!

> వాస్తవాల్ని వాస్తవాలుగా స్వీకరించే లక్షణం మన ప్రజలకు లేదు. వాస్తవాల్ని కూడా సినిమాగా తీసి చూపిస్తే తప్ప మన జనం స్పందించరు, చలించరు! 'జై భీం' సిని మాకు గొప్పగా స్పందించిన ప్రేక్షకులు - సురేంద్ర గాడ్లింగ్; సుధా భరధ్వాజ్; అరుణ్ ఫరేరా.. మొదలైన వారు ఆదివాసీల విడుదల కోసం తమ జీవితాల్ని ఫణంగా పెట్టిన విషయం తెలుసుకోరు. అదే ఆదివాసీల గూర్చి మాట్లాడినందుకు జైల్లోనే చనిపోవాల్సి వచ్చిన స్టాన్‌స్వామి గురించి మాట్లాడుకోరు. ఇంకా జైల్లోనే మగ్గుతున్న ప్రొ.సాయిబాబా గురించిగానీ, మన కళ్ళ ముందే తిరిగిన వరవరరావుకు జరిగిన - జరుగుతున్న అన్యాయం గురించిగానీ అదేమిటో.. ఎవరూ మాట్లాడరు.

సంస్కృతం మాట్లాడితే మధుమేహం రాదు - అని అన్నాడు బీజేపీ ఎంపీ గణేష్ సింగ్. అమె రికాకు చెందిన ఓ సంస్థ పరిశోధనల ప్రకారం రోజూ సంస్కృతం మాట్లా డడం వల్ల మానవ నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని, కొవ్వు నియంత్రణలో ఉంటుందని, మధుమేహం రాదని, ఇస్లామిక్ భాషలతో సహా ప్రపంచంలోని 97 శాతం భాషలు సంస్కృతం ఆధారంగానే రూపొందా యని ఆయన ప్రకటించారు. ఇది ఆయన స్వీయ అనుభవమా కాదా? అనేది చెప్పలేదు. ఈ ప్రకటనతో మనకు కొన్ని విషయాలు అర్థమవుతున్నాయి. 1. ఆయన నాడీ వ్యవస్థ దెబ్బతినదని 2. ఆయన శరీరంలో కొవ్వు నియంత్రణలో లేదని! ఇంతకూ అమెరికా పరిశోధనా సంస్థ దాకా ఎందుకూ? తమరి వారణాసి పరిశోధనా శాలలో తయారైన విశ్వ హిందూ ప్రోడక్ట్స్ - అని చెప్పుకుంటే గొడవే ఉండేది కాదు. మాక్సుముల్లర్ పండితునికి లేని పరిజ్ఞానం ఈ బీజేపీ ఎం.పి.కి ఉన్నందుకు ఆ పార్టీ వారు బహుశా ఛాతీలు విరుచుకుంటున్నారేమో? అన్ని భాషలకు తల్లి సంస్కృతం కాదు నాయనా - అన్ని భాషల కలయిక సంస్కృతం అని చెప్పిన పండితులున్నారు. మరి ఈయన ఎప్పుడైనా విన్నాడో లేదో. 'నేటి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి మూలం భగవద్గీత' అని అన్నాడు వరంగల్ నిట్ అసోసియేట్ ప్రొఫెసర్ పి.ఎమ్.కృష్ణ. ఇతని కన్నా ఉన్నత స్థితిలో ఉన్న పెద్దలే ఇంతకన్నా మూర్ఖంగా మాట్లాడుతున్నారు. అసలైతే ఇలాంటి వాళ్ళ డిగ్రీలు రద్దు చేయాలి. కానీ, ప్రభుత్వాలే సన్నాసుల చేతుల్లో ఉంటే చర్య తీసుకునేది ఎవరూ? కావాలని మూర్ఖ సన్నాసులను ఎన్నుకుంటున్న సగటు మనుషులు తమ మూర్ఖత్వంలోంచి బయటపడి వివేకవంతులయితే కదా - వివేకవంతులను ఎన్నుకునేది? పాఠాలు చెప్పే అధ్యాపకుల ఆలోచనలే అంత నాసిరకంగా ఉంటే, వారి క్లాసులో ఉండే విద్యార్థుల భవిష్యత్తు ఏమిటీ? ఇక దేశ భవిష్యత్తు ఏమిటీ?

ఉత్తరప్రదేశ్ గాజియాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు లేరు. వేరు వేరు కారణాల వల్ల డాక్టర్లంతా ఉద్యోగాలు వదిలేసి వెళ్ళిపోయారు. కొత్తవారెవరూ వచ్చి చేరడం లేదు. ఎందుకంటే అక్కడి ఆసుపత్రులలో పనిచేసే పరిస్థితులు లేవు. వసతుల్లేవు. పరికరాలు లేవు. ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్ళి ప్రాణం మీదకి తెచ్చుకోవడమెందుకని మామూలు ప్రజానీకం కూడా అటువైపు వెళ్ళడం లేదు. అంతగా అవసరమైతే భూమి, జాగా, నగానట్రా అమ్ముకుని ప్రయివేటు హాస్పిటల్స్‌లో చేరుతున్నారు. ప్రభుత్వ పెద్దలకు కావాల్సింది కూడా అదే. కార్పొరేట్లు బలపడితే, ఫలితంగా తాము బలపడినట్లే కదా? అదీ లింకు! ఎప్పటికప్పుడు ఏదో ఓ దేవుడిపై, ఏదో ఓ దేవాలయంపై చర్చ పెట్టుకుని మనోబలాన్ని, మనశ్శాంతిని పొందుతున్నారు. బీజేపీని విమర్శించే ప్రాంతీయ పార్టీలు కూడా తాము అధికారంలో ఉన్న చోట బీజేపీనే అనుసరిస్తున్నాయి. అక్కడ వారు రామమందిరమంటే ఇక్కడ వీరు మరో గుడి పునరుద్ధరిస్తారు. అక్కడ వాళ్ళు ఒక సన్యాసి కాళ్ళ మీద పడితే ఇక్కడ వీరు మరో సన్యాసి కాళ్ళ మీద పడతారు. ఎదురు నిలిచి గట్టిగా నిలదీయాల్సిన ప్రతిపక్షంలో ఉన్న పార్టీలు మూర్ఖపు ప్రజలతో మమేకం అవుతున్నారు. పూజలు నిర్వహిస్తూ బోనాలెత్తుకుని ఊరేగుతున్నారు. ఆచరించేదంతా ఒక్కటే అయినప్పుడు, హిందూ వేరు - హిందుత్వ వేరని ఉపన్యాసాలివ్వడం ఎందుకూ? వేల యేళ్ళ నాటి అనాగరిక సంప్రదాయాల్ని పునరుద్ధరించుకుంటూ తాము ప్రగతి పథాన ఉన్నామంటే ఎట్లా? దేశం వెలిగిపోతోందని చెపుతూ మూర్ఖులు మూర్ఖుల్ని కలుపుకుపోవడమేనా - 'సబ్ కా సాత్ సబ్ కా వికాస్' అంటే? కల్తీ తేనెను అధిక ధరకు అమ్మే రామ్‌దేవ్ దేశభక్తుడు. కష్టపడి తాము పండించిన పంటకు కనీస మద్దతు ధర అడిగే రైతు దేశద్రోహి - ఖలిస్తానీ - ఉగ్రవాది? మొత్తం ఎయిర్‌లైన్స్ అమ్మి ఒకే ఒక్క విమానం కొన్న తొలి ప్రధాని మోదీ అని చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖితమవుతుంది. రాబోయే రోజుల్లో మన పిల్లలకు లెక్కల పరీక్షలో ప్రశ్నలు ఇలా వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఉదాహరణకు - "మూడు ఎయిర్ పోర్టులను అమ్మి ఎనిమిది మంది పార్లమెంట్ సభ్యుల్ని కొన్నచో - ఇరవై రెండు మందిని కొనాలంటే ఎన్ని ఎయిర్‌పోర్టులను అమ్మాలీ?" అని.

వాస్తవాల్ని వాస్తవాలుగా స్వీకరించే లక్షణం మన ప్రజలకు లేదు. వాస్తవాల్ని కూడా సినిమాగా తీసి చూపిస్తే తప్ప మన జనం స్పందించరు, చలించరు! 'జై భీం' సినిమాకు గొప్పగా స్పందించిన ప్రేక్షకులు - సురేంద్ర గాడ్లింగ్; సుధా భరద్వాజ్; అరుణ్ ఫరేరా.. మొదలైనవారు ఆదివాసీల విడుదల కోసం తమ జీవితాల్ని ఫణంగా పెట్టిన విషయం తెలుసుకోరు. అదే ఆదివాసీల గూర్చి మాట్లాడినందుకు జైల్లోనే చనిపోవాల్సి వచ్చిన స్టాన్ స్వామి గురించి మాట్లాడుకోరు. ఇంకా జైల్లోనే మగ్గుతున్న ప్రొ. సాయిబాబా గురించిగానీ, మన కళ్ళ ముందే తిరిగిన వరవరరావుకు జరిగిన - జరుగుతున్న అన్యాయం గురించి గానీ అదేమిటో.. ఎవరూ మాట్లాడరు. అసలు విషయమేమిటంటే కనీసం తెలుసుకుందామన్న ఉత్సుకత కూడా ఉండదు. వీరి జీవితాల్లోని సంఘటనలు ఎవరైనా తెరకెక్కిస్తే మాత్రం మన ప్రేక్షక మహాశయులకు ఎక్కడ లేని ఆవేశం పొంగుకొస్తుంది. ప్రేక్షకులు 'ప్రేక్షకుల్లా' ఉండిపోకుండా తాము బాధ్యతగల పౌరులమన్నది గుర్తుంచుకోవాలి! కేవలం మనదేశంలోనే ఇలా ఎందుకు జరుగుతోందన్నది ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ఉండాలి! మార్పు కోసం ప్రయత్నిస్తూ ఉండాలి!

వ్యాస రచయిత కేంద్ర సాహిత్య అకాడెమి విజేత, జీవ శాస్త్రవేత్త.

8 వేలు దాటిన కొత్త కేసులు..!

న్యూఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ క్రమంగా విస్తరిస్తోంది. తాజాగా కొత్త కేసులు 8 వేలకు పైగా వెలుగుచూశాయి. ప్రస్తుతం మహారాష్ట్ర, కేరళ, ఢిల్లీ, కర్ణాటక, హరియాణాలో మహమ్మారి విజృంభిస్తోంది. దాంతో క్రియాశీల కేసులు 40 వేల మార్కును దాటేశాయి. శనివారం కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం... శుక్రవారం 3.44 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా.. 8,329 మందికి వైరస్ పాజిటివ్‌గా తేలింది. 103 రోజుల తర్వాత ఈ స్థాయి వ్యాప్తి కనిపించింది. పాజిటివిటీ రేటు వరుసగా మూడోరోజు రెండు శాతం(2.41 శాతం) పైనే నమోదైంది. మహారాష్ట్రలో 3,081 మందికి కరోనా సోకగా.. ఒక్క ముంబైలోనే ఆ సంఖ్య 1,956గా ఉంది. దాంతో ఆ నగరంలో పాజిటివిటీ రేటు 12.74 శాతానికి చేరి, ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. కేరళలో 2,415, ఢిల్లీలో 655 మంది వైరస్ బారినపడ్డారు. 2020 ప్రారంభం నుంచి 4.32 కోట్లకు పైగా కొవిడ్ కేసులొచ్చాయి. తాజా విజృంభణతో బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం వైరస్‌తో బాధపడుతున్న వారి సంఖ్య(క్రియాశీల కేసులు) 40,370కి చేరింది. మొత్తం కేసుల్లో ఆ వాటా 0.09 శాతంగా నమోదైంది. 24 గంటల వ్యవధిలో 4,216 మంది కొవిడ్ నుంచి కోలుకున్నారు. దేశంలో రికవరీ రేటు 98.69 శాతానికి పడిపోయింది. శుక్రవారం 10 మంది మరణించారు. 15.08 లక్షల మంది టీకా తీసుకోగా.. ఇప్పటివరకూ 194.9 కోట్లకు పైగా డోసులు పంపిణీ అయ్యాయని కేంద్రం తెలిపింది.

మంగళూరు కళాశాలలో విద్యార్థుల ఘర్షణ

మంగళూరు : నగరంలోని విశ్వవిద్యాలయ కళాశాల వద్ద రెండు విద్యార్థి గ్రూపులు ఘర్షణకు దిగాయి. కొన్ని రోజుల క్రితం తరగతి గదిలో వీర సావర్కర్, భారత మాత చిత్ర పటాలను కొంతమంది విద్యార్థులు ఏర్పాటు చేయడం వివాదంగా మారిందని పోలీసు వర్గాలు శనివారం తెలిపాయి. ఇతర విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వచ్చిన తర్వాత కళాశాల యాజమాన్యం తర్వాతి రోజు ఆ చిత్రపటాలను తొలగించింది. విద్యార్థుల గ్రూపు ఆ చిత్రపటాలను ఏర్పాటు చేస్తున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ ఘర్షణలో స్వల్ప గాయాలైన ముగ్గురు విద్యార్థులను ఒక ఆస్పత్రిలో చేర్చారు. ఘర్షణకు దారితీసిన చిత్రపటాలపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా విద్యార్థుల బృందం ఇతర విద్యార్థులతో వాగ్వాదానికి దిగడంతో శుక్రవారం సమస్య మళ్లీ తెరపైకి వచ్చినట్లు ఆ వర్గాలు తెలిపాయి. కాగా మంగళూరు సౌత్ పోలీసులకు రెండు విద్యార్థి గ్రూపులు పరస్పరం ఫిర్యాదు చేశాయని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ రాయ్ మాట్లాడుతూ ఈ ఘర్షణలో పాల్గొన్న విద్యార్థులను గుర్తించనున్నామని, అంతర్గత విచారణ తర్వాత వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆర్‌సీపీ సింగ్‌కు బంగ్లా హుళక్కే..!

ఖాళీ చేయాలని కోరిన బీహార్ ప్రభుత్వం

పాట్నా : కేంద్ర మంత్రి ఆర్‌సీపీ సింగ్ కొన్నేళ్లుగా తాను ఉంటున్న పాట్నాలోని విశాలమైన బంగ్లాను ఇప్పుడు వదులుకోవలసి వస్తుంది. ఏడాది క్రితం వరకు తాను సారథ్యం వహించిన జేడీ(యూ) ద్వారా మరోసారి రాజ్యసభ పదవి ఆయనకు నిరాకరించిన విషయం తెలిసిందే. కాగా మంత్రి బంగ్లా 07, స్ట్రాండ్ రోడ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేటాయించనున్నట్లు ఈ వారం మొదట్లో భవన నిర్మాణ విభాగం జారీ చేసిన ఒక నోటిఫికేషన్ పేర్కొంది. 'బంగ్లాను ఆర్‌సీపీ సింగ్‌కు కేటాయించలేదు. ఆర్‌సీపీ నివసించడానికి అనుమతించిన జేడీ(యూ) ఎమ్మెల్సీ సంజయ్ గాంధీకి ఆ బంగ్లాను కేటాయించాం. ఇప్పుడు అదే రోడ్డులో గాంధీకి మరో బంగ్లా కేటాయించాం' అని రాష్ట్ర భవన నిర్మాణ శాఖ మంత్రి అశోక్ చౌదరి తెలిపారు. ఇందులో రాజకీయ కోణం లేదని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి 07, సర్క్యులర్ రోడ్ నుంచి బంగ్లా కేటాయించామని, ఇంతకుముందు రాష్ట్ర అత్యున్నత అధికారి అందులో ఉన్నారని సీఎం నితీశ్‌కి సన్నిహితుల్లో ఒకరయిన జేడీ(యూ) నాయకుడు చౌదరి అన్నారు. 'ముఖ్యమంత్రి అధికారిక నివాసం 01, అన్నే మార్గ్, 100 సంవత్సరాలకు పైగా పురాతనమైనది. విస్తృత మరమ్మతులు జరుగుతున్నాయి. అందువల్ల ఆయన 07, సర్క్యులర్ రోడ్‌కి మారాడు. తగిన సమయంలో ఆయన ప్రస్తుత నివాసాన్ని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో భాగం చేయాలని, ప్రధాన కార్యదర్శికి కొత్త ఇంటిని కేటాయించాలని నిర్ణయించారు' చౌదరి చెప్పారు. ఇదిలాఉండగా, నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఉక్కు మంత్రిత్వ శాఖను కలిగి ఉన్న ఆర్‌సీపీ సింగ్, రాజ్యసభ పదవీకాలం జులైలో ముగియడంతో ఆయన కేంద్ర మంత్రి పదవి ప్రమాదంలో పడింది. 2010లో రాజకీయాల్లోకి ప్రవేశించిన మాజీ ఐఏఎస్ అధికారి ఆర్‌సీపీ సింగ్ ముఖ్యమంత్రి నితీశ్‌తో కలిసి వివిధ హోదాల్లో పని చేసిన కొద్ది నెలల్లోనే కేంద్ర మంత్రి అయ్యారు. అయితే కేంద్ర మంత్రివర్గంలో సింగ్‌కు చోటు దక్కే అవకాశం ఉన్నప్పటికీ మరోసారి రాజ్యసభ పదవి నిరాకరణ, ఇప్పుడు బంగ్లాను ఖాళీ చేయాలనడం ఆర్‌సీపీ విధేయులను ఆశ్చర్యపరిచింది.

సఫాయి పని నిర్మూలనకు ప్రత్యేక సంస్థ

- పారిశుద్ధ్య యంత్రాలనే నిర్వహించాలి
- సఫాయీ కర్మచారీ ఆందోళన్ కన్వీనర్ బెజవాడ విల్సన్ డిమాండ్

న్యూఢిల్లీ : దుర్భరమైన, అమానవీయమైన పాకీ పని (హ్యూమన్ స్కావెంజింగ్)ని దేశంలో పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక సంస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందని సఫాయీ కర్మచారీ ఆందోళన్ (ఎస్‌కేఏ) కన్వీనర్, రామన్ మెగసెసె అవార్డు గ్రహీత బెజవాడ విల్సన్ వక్కాణించారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చైతన్యాన్ని తీసుకువచ్చే లక్ష్యంతో 75 రోజుల పాటు సాగే కార్యక్రమాన్ని గత నెలలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విల్సన్ మీడియాకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఏళ్లుగడిచినా యాంత్రీకరణ శుభ్రతకు ఎలాంటి పథకం లేదని విమర్శించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధిపరిచేందుకు కొంతమంది ప్రైవేటు వ్యక్తులపై లేదా సంస్థలపై ప్రభుత్వం ఆధారపడుతోందన్నారు. చాలా కేసుల్లో కొన్ని యంత్రాలను కొనుగోలు చేయడం లేదా ప్రైవేటు కాంట్రాక్టర్‌కు ఔట్‌సోర్సింగ్‌కు ఇచ్చేయడం జరుగుతోందని అన్నారు. అలా కాకుండా అవసరమైన సాంకేతికతను అభివృద్ధిపరిచేందుకు సొంతంగా యంత్రాంగం వుండాలని విల్సన్ డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో ఇటువంటి చర్యలు చేపట్టేందుకు తగిన రాజకీయ సంకల్పం వుండాలన్నారు. అందువల్ల మొత్తంగా ఈ సమస్య పరిష్కారానికి విడిగా, ప్రత్యేకంగా ఒక సంస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని స్పష్టం చేశారు. పాకీ పని కారణంగా 2016-2020 మధ్య 472 మరణాలు సంభవించాయని చెప్పారు. కాలువలు, సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరిచే సమయంలో ఇటువంటి మరణాలు ఇప్పటికీ సంభవిస్తూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని విల్సన్ నిశితంగా విమర్శించారు. ఇందుకు బదులుగా నిజాలను నిరాకరిస్తూ, ప్రజలను తప్పుదారి పట్టించేలా పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. పైపెచ్చు ఒకదానికొకటి పొంతన లేని ప్రకటనలు చేస్తున్నారన్నారు. పాకీ పనిచేస్తూ మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సుప్రీం కోర్టు 2014లో తీర్పు చెప్పినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదన్నారు. చాలా రాష్ట్రాల్లో ఒక్క కుటుంబం కూడా నష్టపరిహారాన్ని అందుకోలేదని చెప్పారు. తెలంగాణాలో కొంత మేరకు అందుకున్నారనీ, ఈ విషయంలో తమిళనాడు, పంజాబ్‌ల్లో పరిస్థితులు పర్వాలేదని చెప్పారు.

యూట్యూబర్ అరెస్ట్

శ్రీనగర్: మహమ్మద్ ప్రవక్తపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నూపుర్ శర్మ (ఫొటో) తలను కత్తితో నరికినట్లు ప్రదర్శిస్తూ ఓ వీడియోను చిత్రీకరించినందుకు కశ్మీరుకు చెందిన యూట్యూబర్ ఫైజల్ వనీని అరెస్టు చేశారు. వనీ యూట్యూబ్‌లో 'డీప్ పెయిన్ ఫిట్నెస్' పేరుతో ఓ చానల్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ వివరాలను జమ్మూ-కశ్మీరు పోలీసులు శనివారం మీడియాకు తెలిపారు. అంతకుముందు వనీ మాట్లాడుతూ, బీజేపీ నుంచి సస్పెండైన నూపుర్ శర్మ తలను తెగ్గోసినట్లు ప్రదర్శిస్తూ వీడియోను తాను రూపొందించానని, అది క్షణాల్లోనే వైరల్ అయిందని చెప్పారు. అయితే తనకు ఎటువంటి దురుద్దేశాలు లేవన్నారు. తాను ఆ వీడియోను డిలీట్ చేశానని తెలిపారు. ఆ వీడియో ఎవరినైనా గాయపరచి ఉంటే క్షమించాలని కోరానని చెప్పారు. నూపుర్ శర్మ గత నెలలో ఓ టీవీ చర్చా కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి హోదాలో మాట్లాడారు. ప్రవక్త మహమ్మద్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో ముస్లిం దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. అప్రమత్తమైన బీజేపీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. నూపుర్ శర్మతోపాటు మరో నేత నవీన్ జిందాల్‌పై చర్యలు తీసుకుంది. టీవీ చర్చల్లో పాల్గొనే ప్రతినిధులకు నూతన మార్గదర్శకాలను జారీ చేసింది.

హౌరాలో హింస.. పోలీసులతో ఆందోళనకారుల గొడవ

ఇళ్లకు నిప్పు

కోల్‌కతా: మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ నేతలు చేసిన వివాదాస్పద వ్యాఖ్యల వేడి ఇంకా రగులుతూనే ఉంది. శనివారం హౌరాలో ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య గొడవ జరగడంతో... అనేకమంది ఆందోళనకారులు స్థానికంగా ఉన్న ఇళ్లకు నిప్పుపెట్టినట్టు సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లదాడి చేశారు. కొంతమంది గాయపడ్డారు. పక్కనే ఉన్న బీజేపీ కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. ఆందోళన కారులను చెదరగొట్టేందుకు అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగగా, పోలీసులు భాష్పవాయు ప్రయోగం చేశారు. దీంతో అప్పటికి పరిస్థితి చక్కబడింది. 'ఆందోళనకారులు చెల్లచెదురయ్యారు. రాళ్లదాడిలో పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ ప్రాంతామంతా పోలీసులు పహారా కాసేలా ప్రణాళిక రచించాం. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది' అని అధికారి తెలిపారు. మహమ్మద్ ప్రవక్తపై సస్పెండైన బీజేపీ అధికారి ప్రతినిధి నుపూర్ వర్మ, బహిష్కృత నాయకుడు నవీన్ జిందాల్ వ్యాఖ్యలకు నిరసనగా ఆందోళనకారులు హౌరా జిల్లాలోని అనేక చోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. రాళ్ల దాడి, పోలీసు వాహనాలకు నిప్పు పెట్టడం, హింసాత్మక నిరసనలు, పోలీసులపై దాడి వంటి చర్యలపై పై అధికారులు నివేదిక అందజేశామని ఆయన వివరించారు. జూన్ 13 వరకూ ఇంటర్‌నెట్ సేవలను నిషేధించారు. 144 సెక్షన్ కూడా విధించారు.

పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడి అరెస్ట్

హింస చెలరేగిన హౌరా జిల్లాలో పర్యటించేందుకు బయలుదేరిన పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకంత మజుందార్‌ను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఉత్తర దినాజ్‌పూర్‌లోని బలూర్‌ఘాట్ ఎంపీ అయిన మజుందార్‌ను విద్యాసాగర్ సేతు టోల్‌ప్లాజా వద్ద అదుపులోకి తీసుకున్నట్టు పేర్కొన్నారు. '144 సెక్షన్ విధించిన హౌరా వెళ్లేందుకు మజుందార్ ప్రయత్నించారు. ఆయన సందర్శనతో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడే అవకాశం ఉంది. ముందు జాగ్రత్త చర్యగానే ఆయన్ను అరెస్టు చేశాం' అని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. దీనిపై మజుందార్ మాట్లాడుతూ త్వరలోనే బెంగాల్ కూడా కశ్మీర్‌లా తయారవుతుందని వ్యాఖ్యానించారు. మజుందార్ అరెస్టు వార్త విన్న కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఆయన అరెస్టును నిరసిస్తూ బీజేపీ ఎమ్మెల్యే అగ్నిమిత్ర పౌల్, వందలాది కార్యకర్తలు లాల్‌బజార్‌లోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌కు చేరుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసుల చర్యపై తృణమూల్ కాంగ్రెస్ స్పందిస్తూ మజుందార్ అరెస్టు సబబేనని, ఉద్రిక్త ప్రాంతంలోకి వెళ్లి మతపరమైన గొడవలకు ఆజ్యం పోసేందుకు ఆయన పర్యటన అని విమర్శించింది. దీనిపై కోల్‌కతా మేయర్ ఫిర్హాద్ హకీం మాట్లాడుతూ ఇంత గొడవలకు కారణమైన సస్పెండైన బీజేపీ అధికార ప్రతినిధి నుపుర్ శర్మను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు దిలీప్ గోష్ హౌరాలో ధ్వంసమైన పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు.

పోలీసుల గుప్పెట్లో రాంచీ

రాంచీ: జార్ఖండ్ రాజధాని రాంచీ పోలీసుల గుప్పెట్లో ఉంది. స్థానిక ప్రాంతాలకు ఎక్కడికక్కడ భద్రతా దళాలు తమ అధీనంలోకి తీసుకున్నాయి. భారతీయ జనతా పార్టీ మాజీ అధికార ప్రతినిధి ఇటీవల ప్రవక్త మహమ్మద్‌పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో జార్ఖండ్‌లోని రాంచీలో శుక్రవారం పెద్ద ఎత్తున హింసాకాండ చెలరేగింది. ఈ హింసాకాండలో ఇద్దరు మృతి చెందారు. సుమారు 2,500మంది ఐజీ, డీఐజీ ర్యాంక్ ఆఫీసర్లు, ఆరుగురు ఎస్పీ ర్యాంక్ ఆఫీసర్లు, 100మంది డీఎస్పీ ర్యాంక్ ఆఫీసర్లు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ రాంచీలో కవుకాశారని ఐజీ(ఆపరేషన్స్) అమోల్ వి హోమ్‌కార్ తెలిపారు. 'ఈ హింసలో 12మంది పోలీసులు, 12మంది ఇతరులు తీవ్రంగా గాయపడ్డారు. ఒక పోలీసులకు బులెట్ గాయమైంది. చనిపోయిన ఇద్దరికీ అదే రోజు అంత్యక్రియలు జరిగాయి. పరిస్థితి అదుపులోకి వచ్చే వరకూ ఇంటర్‌నెట్ సేవలు నిషేధించాం' అని ఆయన వివరించారు.

అవినీతి, అక్రమాలతో రాజ్యసభ ఎన్నికల్లో గట్టెక్కిన బీజేపీ

న్యూఢిల్లీ : రాజ్యసభలో మెజారిటీ సాధించాలన్న పట్టుదలతో ఉన్న బీజేపీ శుక్రవారం జరిగిన ఎన్నికలలో అనేక అక్రమాలు, అవినీతికిపాల్పడింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని విజయం సాధించేందుకు చేయాల్సిందంతా చేసింది. 16 స్థానాలకు హోరాహోరి పోటీ జరిగిన నాలుగు రాష్ట్రాల్లో మూడింటిలో ఎట్టకేలకు బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంది. క్రాస్ ఓటింగ్, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ప్రతిపక్షాలపై బురద జల్లినా బీజేపీనే ఎక్కువ స్థానాలు గెలుచుకున్నది. అయితే, రాజస్తాన్ వంటి కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రంలో బీజేపీ కుయుక్తులు పనిచేయలేదు. రాజస్తాన్‌లో కాంగ్రెస్ మూడు స్థానాలను నిలబెట్టుకోగా.. హరియాణాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ నాలుగు రాష్ట్రాల నుంచి ఎగువ సభకు ఎన్నికైన బీజేపీ అభ్యర్థులో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, మాజీ సహాయ మంత్రి అనిల్ బోండే, ధనంజయ్ మహదిక్ ఉన్నారు. కాంగ్రెస్ నుంచి రణదీప్ సూర్జేవాలా, జైరాం రమేష్ ఉన్నారు. కేంద్ర మాజీ మంత్రి అజయ్ మాకెన్ హరియాణాలో పరాజయాన్ని చవిచూశారు.

మహారాష్ట్రలోనూ పోటీ ఆసక్తికరంగా జరిగింది. మొత్తం ఆరు స్థానాలకు బీజేపీ మూడింటిని గెలుచుకుంది. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, అనిల్ బోండే, ధనంజయ్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. మహా అఘాడీ ప్రభుత్వంలో ఒకటైన శివసేన ఇద్దరు అభ్యర్థులను నిలబెట్టగా ఒకరు విజయం సాధించగా, మరొకరు ఓటమిచవిచూశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఇమ్రాన్ ప్రతాప్‌గఢి ఎన్‌సీపీ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి ప్రఫుల్ పటేల్ రాజ్యసభకు ఎన్నికయ్యారు. హరియాణాలో కాంగ్రెస్‌కు ఘోర పరాజయం ఎదురైంది. ఇక్కడ ఎన్నిక జరిగిన రెండు స్థానాలనూ బీజేపీ గెలుచుకుంది. ఆ పార్టీ నేత క్రిషన్ లాల్ పన్వార్‌తో పాటు ఆ పార్టీ మద్దతు ప్రకటించిన కార్తికేయ శర్మ విజయం సాధించారు. కాంగ్రెస్ నేత అజయ్ మకెన్‌కు పరాభవం తప్పలేదు. రాజస్తాన్‌లో మూడింటిని కాంగ్రెస్ దక్కించుకోగా బీజేపీ ఒక్క సీటు మాత్రమే గెలుచుకున్నది. కర్ణాటకలో నాలుగు స్థానాల్లో మూడు బీజేపీ, ఒకటి కాంగ్రెస్ గెలుచుకున్నాయి.

చదువుకున్నదని ఉద్యోగం చేయాలని చెప్పలేం

బాంబే హైకోర్టు

ముంబై: చదువుకున్నంత మాత్రానా మహిళను ఉద్యోగం చేయాలని బలవంతం చేయలేమని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. గ్రాడ్యుయేట్ అయిన మహిళ బయటకు వెళ్లి పని చేయాలా లేక ఇంటి వద్దనే ఉండాలా అన్నది పూర్తిగా ఆమె ఎంపికపైనే ఆధారపడివుంటుందని పేర్కొంది. ఒక కేసు విచారణ సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యానించింది. మహారాష్ట్రలోని పూణేకు చెందిన ఒక జంటకు 2010లో పెళ్లి అయ్యింది. 2013లో భర్త, అతడి కుటుంబంపై భార్య గృహహింస కేసు పెట్టింది. దీంతో కుమార్తెతో కలిసి విడిగా ఆమె నివసిస్తున్నది. గృహహింస కేసుపై విచారణ పెండింగ్‌లో ఉండటంతో భర్త నుంచి పోషణ ఖర్చులు కోరుతూ కోర్టును ఆశ్రయించింది. దీంతో భార్యకు రూ.5,000, కుమార్తె ఖర్చుల కోసం విడిగా రూ.7,000 చొప్పున నెలకు చెల్లించాలని భర్తను పూణే ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది.కాగా, ఆ మహిళ భర్త దీనిని బాంబే హైకోర్టులో సవాల్ చేశాడు. భార్య వరుసగా వేస్తున్న కేసులపై పోరాడే ఆర్థిక స్థోమత లేదా ఆర్థిక వనరులు తన వద్ద లేవని పిటిషన్‌లో పేర్కొన్నాడు. ఉద్యోగం చేస్తున్న భార్య, ఎలాంటి ఆదాయ వనరు లేదని అబద్ధం చెపుతోందని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి భారతి డాంగ్రే విచారణ జరిపి గ్రాడ్యుయేట్ అయిన మహిళ ఉద్యోగం చేయకుండా ఇంట్లో ఖాళీగా కూర్చోకూడదని మనం అనలేమన్నారు. చదువుకున్న మహిళ ఉద్యోగం చేయాలా లేక ఇంటి వద్దనే ఉండాలా అన్నది ఆమె నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. 'ఒక స్త్రీ ఇంటికి ఆర్థిక సహకారం అందించాలనేది మన సమాజం ఇంకా అంగీకరించలేదు. చదువుకున్న మహిళ పని చేయాలా లేక వద్దా అనేది ఆమె ఎంపిక. ఈ కేసులోని ఒకరు (భార్య) గ్రాడ్యుయేట్ అయినందున ఆమె ఇంటి వద్దనే ఉండాలన్నది కాదు. ఈ రోజు నేను న్యాయమూర్తిని. ఒకవేళ రేపు నేను ఇంట్లోనే ఉండాలనుకోవచ్చు. న్యాయమూర్తి అర్హత ఉన్నందున నేను ఇంటికే పరిమితం కాకూడదని మీరు చెబుతారా?' అని న్యాయమూర్తి భారతి ప్రశ్నించారు. కాగా, భర్త తరపు న్యాయవాది వాదనలపై స్పందించేందుకు భార్య తరుపు న్యాయవాది కోర్టును సమయం కోరారు. దీంతో ఈ కేసు తదుపరి విచారణను వచ్చే వారానికి కోర్టు వాయిదా వేసింది.

జార్ఖండ్‌లో అల్లర్లు

- అవకాశవాద శక్తులపై అప్రమత్తంకండి
- ప్రజలకు ప్రభుత్వం పిలుపు

జంషెడ్‌పూర్ : శాంతిని ప్రేమించే జార్ఖండ్ ప్రజలు అవకాశవాద శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి బన్నా గుప్తా పిలుపునిచ్చారు. శుక్రవారం రాజధాని రాంచీ నగరంలో చెలరేగిన అల్లర్లు, హింస్మాతక ఘటనల వెనుక దుష్టశ క్తుల కుట్ర ఉందని పేర్కొన్నారు. వ్యవస్థీకృత మైన కొన్ని అవకాశ వాద శక్తులు రాంచీలోని ప్రశాంతతను దెబ్బతీ యాలని కుట్రలు చేస్తున్నా యని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు హింసను హర్షించరని, అశాంతిని ప్రేరేపించాలని చూస్తున్నవారి ఆటల్ని సాగనివ్వ మంటూ ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చర్యలు తీసుకున్నారని, చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్నా చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మహమ్మద్ ప్రవక్తపై బీజేపీ నేతలు నూపుర్ శర్మ తదితరులు చేసిన అను చిత వ్యాఖ్యల నేపథ్యంలో రాంచీలో శుక్రవారం జరిగిన హింసాత్మక ఘటనల్లో ఇద్దరు మృతి చెందగా చాలా మంది గాయపడ్డ విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా పాలము జిల్లా అదనపు కమిషనర్ శశిరంజన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు ఇతర శాఖల అధికారుతలో సమన్వయం చేసుకుని పని చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్టు తెలిపారు. సంఘవ్యతిరేక శక్తులపై నిఘా పెట్టాలని ఆదేశాలు జారీ చేసిందని పేర్కొన్నారు. సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి భద్రతా సిబ్బందని మోహరించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ అల్లర్లు జరిగినా తక్షణం అక్కడకు చేరుకునేలా పోలీసు విభాగాలను సిద్ధం చేసినట్టు చత్రా జిల్లా ఎస్పీ రాకేశ్ రంజన్ తెలిపారు. ఉక్కు నగరంగా పేరుపొందిన జంషెడ్‌పూర్‌లో భారీగా భద్రతను ఏర్పాట్లను పటిష్టం చేశామని వివరించారు.

భయపెట్టడానికి ప్రయత్నించకండి: విజయన్

తిరువనంతపురం: కేరళలో గోల్డ్ స్మగ్లింగ్ కేసు వ్యవహారం మరోసారి రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ కేసులో కీలక నిందితురాలు స్వప్నా సురేశ్ ఇటీవల సీఎం పినరయి విజయన్, ఆయన కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణలతో రాజకీయ దుమారం కొనసాగుతోంది. సీఎం విజయన్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలోని అనేక చోట్ల కాంగ్రెస్ శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో తనపై చేస్తోన్న ఆరోపణలపై విజయన్ తీవ్రస్థాయిలో స్పందించారు. కేరళ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర సదస్సులో మాట్లాడుతూ.. ఇలాంటి ఆరోపణలు తనను గానీ.. తమ ప్రభుత్వాన్ని గానీ ఏ విధంగానూ ప్రభావితం చేయలేవన్నారు. తమకు ప్రజల మద్దతు, విశ్వాసం ఉందని చెప్పారు. ఎన్నికల ముందు కూడా వరదలు సహా ఇలాంటి అనేక ఆరోపణలు చేసినా ప్రజలు వాటన్నింటినీ తిరస్కరించి 99సీట్లలో గెలిపించి రెండోసారి తమకు అపూర్వ విజయం అందించారన్నారు. తాము ప్రజలకు మరింత రుణపడి ఉన్నామని తెలిపారు. దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఏ శక్తుల ముందూ తాము తలవంచబోమని తేల్చి చెప్పారు. దేశంలో సెక్యులర్ స్ఫూర్తిని పరిరక్షించాలని, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా దృఢ వైఖరితో ఉండాలంటూ కొనసాగించిన తన ప్రసంగంలో తాజా ఘటనల నేపథ్యంలో విపక్షాల ఆరోపణలకు దీటుగా బదులిచ్చే ప్రయత్నం చేశారు. ఇలాంటి ఆరోపణలు చేసి భయపెట్టేందుకు ప్రయత్నించొద్దని.. ఇలాంటి జిమ్మిక్కులు, ప్రయత్నాలేవీ ఫలించబోవన్నారు. తమ పట్ల ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్న ఆయన.. కొందరు స్వార్థంతో చేసే ఆరోపణల్లో వాస్తవాలను గుర్తించగలరని చెప్పారు. గోల్డ్ స్మగ్లింగ్ కేసులో నిందితుల వాంగ్మూలాలకు సంబంధించిన వార్తలకు మీడియా అధిక ప్రాధాన్యమివ్వడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి వార్తల ద్వారా ఎల్డీఎఫ్ ప్రభుత్వ ప్రతిష్ఠను మంటకలపొచ్చని మీడియా భావిస్తోందా? అని ప్రశ్నించారు. అలాంటి రిపోర్టులు మీ విశ్వసనీయతకు సరిపోతాయో, లేదో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం ఇదేనన్నారు. మీడియాను సరిదిద్దేందుకు ఎవరూ రారని.. ప్రజలే అంతిమ నిర్ణేతలు అని పేర్కొన్నారు.

యాసిడ్ దాడులకు వ్యతిరేకంగా...

కఠిన చట్టాలు : సీఎం బసవరాజ్ బొమ్మై

హుబ్లీ : మహిళలపై యాసిడ్ దాడులకు పాల్పడుతున్న వారికి కఠినమైన శిక్షలు పడేలా మరికొన్ని చట్టాలను తీసుకురావలసిన అవసరముందని కర్ణాటక సీఎం బసవరాజ్ బొమ్మై అన్నారు. రాష్ట్రంలో గత రెండు నెలల వ్యవధిలో రెండు చోట్ల మహిళలపై యాసిడ్ దాడుల ఘటనలు వెలుగులోకి వచ్చిన తరుణంలో సీఎం ఈ మేరకు స్పందించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలపై యాసిడ్ దాడులు జరగడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాల్సి ఉందని చెప్పారు. ఇందు కోసం మరిన్ని కఠినమైన చట్టాలను రూపొందిస్తామని పేర్కొన్నారు. ఇప్పుడున్న చట్టాలను కూడా మరింత పటిష్టవంతంగా మారుస్తామని చెప్పారు. నిందితులు భయపడేలా కఠినమైన శిక్షలు పడేలా న్యాయ నిపుణులతో చర్చలు జరుపుతున్నట్టు వివరించారు. ఇదిలా ఉండగా హుబ్లీ నగరంలో శుక్రవారం నగరంలో ఉంటున్న మహిళ పెళ్లికి నిరాకరించడంతో ఒక వ్యక్తి యాసిడ్ పోయడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు.

గణనీయంగా పెరిగిన ట్యాక్స్ రిటర్న్స్



పనాజీ: గత ఆర్థిక సంవత్సరం కంటే 2022 ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను రిటర్న్‌ల సంఖ్య పెరిగిందని ప్రత్యక్ష పన్నుల బోర్డు చైర్మన్ సంగీతా సింగ్ శనివారం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను రిటర్న్‌ల సంఖ్య రూ.7.14 కోట్లుగా ఉంది, గత ఆర్థిక సంవత్సరంలో ఇది 6.9 కోట్లుగా ఉంది, ఇది స్పష్టమైన వృద్ధిని చూపుతోంది. "పన్ను చెల్లింపుదారుల సంఖ్య, సవరించిన రిటర్న్‌ల దాఖలులో పెరుగుదల ఉంది" అని ఆమె పేర్కొన్నారు. బోర్డు పన్ను వసూళ్లలో పెరుగుదలను చూస్తోంది, ఇది సాధారణంగా దేశం ఆర్థిక వృద్ధిలో పురోగతిని చూపుతున్నట్లయితనే ఇది జరుగుతుందని, ఆర్థిక కార్యకలాపాలు ఎక్కువగా ఉంటే, కొనుగోళ్లు, అమ్మకాలు కూడా పెరుగుతాయని ఆమె అన్నారు. ఆర్థిక వ్యవస్థ పురోగమనంలో ఉంటే తప్ప, పన్నులు పెరగవని ఆమె తెలిపారు. రెండోది డిజిటల్ ఇండియా గురించి ప్రధాని నరేంద్ర మోదీ చొరవ, ఇచ్చిన పిలుపు కారణంగా పన్నుల చెల్లింపులో డిపార్ట్‌మెంట్ వృద్ధిని చూస్తోంది అని ఆమె అన్నారు, కోవిడ్ ఉధృతంగా ఉన్న సమయంలో ప్రజలు ఎక్కువ డిజిటల్‌గా చెల్లించడం ప్రారంభించారనీ, ఇదే ప్రజల్లో మార్పులకు దారి తీసిందని ఆమె వివరించారు. పన్ను చెల్లింపుదారులకు సమాచారం అందించే వారు సకాలంలో పన్నులు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. తాము సంవత్సరాలుగా పెద్ద ఎత్తున డిజిటలైజేషన్ చేపట్టామని తెలిపారు. ఇక 2022 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, రూ.14 లక్షల కోట్ల కంటే ఎక్కువ పన్ను వసూళ్లు జరిగాయని, ఇది 2020 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వసూళ్లతో పోలిస్తే పురోగతి బాగుందని ఆమె తెలిపారు.

17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నోటరీల సంఖ్య పెంపు

న్యూఢిల్లీ: కేంద్ర నోటరీలుగా నియామకం కోసం ఆశావహుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో వారి మొత్తం బలాన్ని పెంచుకున్నట్లు కేంద్ర మంత్రి ఎస్‌పీ సింగ్ బఘెల్ శనివారం తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 1,700 మంది సెంట్రల్ నోటరీలను కలిగి ఉంటారని, గుజరాత్‌లో 8వేల మంది నోటరీలను కలిగి ఉంటారని కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి ఒక ట్వీట్‌లో తెలిపారు. కేరళ, మధ్యప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, గోవా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, పుదుచ్చేరిలలో వారి సంఖ్య పెరగనున్నది.

బీజేపీ వ్యతిరేక కూటముల్లో
ఐక్యత అవసరం

- కేసీఆర్ పెట్టే జాతీయ పార్టీకి ఆహ్వానం
- సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ

హైదరాబాద్: జాతీయ రాజకీయాలపై దృష్టి పెట్టిన తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్ జాతీయ స్థాయిలో కొత్త రాజకీయ పార్టీని పెట్టడాన్ని ఆహ్వానిస్తు న్నట్టు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ అన్నారు. ఆయన త్వరలో దిల్లీకి మకాం మార్చి కార్యకలా పాలను ప్రారంభిస్తారంటే మంచిదేనని శనివారం మీడియాకు విడుదల చేసిన ఒక వీడియోలో పేర్కొన్నారు. అయితే రాజకీయ లక్ష్యం విషయంలో మాత్రం కేసీఆర్‌కు స్పష్టమైన వైఖరి ఉండాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలన చాలా దుర్మార్గంగా ఉందని, రానున్న రోజుల్లో రాష్ట్రపతి ఎన్నికలు కూడా ఉన్న తరుణంలో మరింత జాగ్రత్తగా ఉండాల్సింటుందని పేర్కొన్నారు. ప్రతి పక్షాల తరపున రాష్ట్రపతి అభ్యర్థి ఒకరే అయితే తప్ప ఆశించిన ఫలితాలు ఉండవని చెప్పారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఈ విషయంలో ప్రతి పక్షాలతో మాట్లాడుతోందని, కేసీఆర్ కూడా వివిధ పార్టీల నేతలతో మాట్లాడుతున్న క్రమంలో అందరూ ఏకతాటిపైకి వచ్చి బీజేపీ వ్యతిరేక కూటమిని బలపర్చే రాజకీయ ఎత్తుగడలు వేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఇది సాధ్యం పక్షంలో ప్రయోజనం ఉండదని తెలిపారు. ఇక ఏపీ సీఎం జగన్‌తో ఇప్పటికీ కేసీఆర్ మాట్లాడలేదని, మించి మిత్రుడైన ఆయన్ను కూడా కలుపుకుని వెళ్లాల్సి ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో ప్రతిపక్షాల కూటములన్నీ కలవాలని, అధ్యక్ష ఎన్నికల్లో విడివిడిగా కాకుండా ప్రతిపక్షాలన్నీ ఉమ్మడి అభ్యర్థిని నిలిపితేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. లేకపోతే దుష్ఫలితాలు తప్పవని హెచ్చరించారు.



మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన ముప్పాళ్ల, నర్సింహులు,సుందర్‌లాల్ తదితరులు

సభకు హాజరైన సీపీఐ శ్రేణులు

మోదీని సాగనంపాల్సిందే

- దేశంలో ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు
- మతోన్మాద వ్యాఖ్యలు చేసిన నూపుర్, నవీన్ జిందాల్‌ను అరెస్టు చేయాలి
- జాతికి మోదీ క్షమాపణ చెప్పాలి
- రాష్ట్ర అభివృద్ధిని గాలికొదిలేసిన జగన్
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: కేంద్రంలోని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తోందని, ఫలితంగా మతోన్మాదుల దాడులు అధికమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శ్రీకాకుళం జిల్లా సీపీఐ 24వ మహాసభల్లో భాగంగా రెండవ రోజు శనివారం స్థానిక ఎస్‌వీడీ కన్వెన్షన్ హాల్‌లో సీపీఐ ప్రతినిధుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. తొలుత సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిక్కాల గోవిందరావు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సీపీఐ సీనియర్ నాయకులు చీకటి నర్సింహులు అమరవీరుల స్థూపాన్ని ఆవిష్కరించి, అమరులకు నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన కె.రామకృష్ణ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశంలో హిందూ మతోన్మాదం పెచ్చుమీరుతోందని, హిందూ మతమే ఉండాలనే విధంగా బీజేపీ పాలన సాగిస్తోందని విమర్శించారు. బీజేపీ బహిష్కృత నేతలు నూపూర్ శర్మ, నవీన్ జిందాల్ మహ్మద్ ప్రవక్తపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై దేశంలోని ముస్లిం సోదరులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, మతోన్మాదంతో అలాంటి వ్యాఖ్యలు చేసిన వారిని క్షమించరాదని, వారిద్దరినీ తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వారి వ్యాఖ్యలతో ప్రపంచ దేశాల్లో భారతదేశాన్ని చిన్న చూపు చూస్తున్నారని, ఇలాంటి పరిస్థితి రావడానికి మోదీయే కారణమని, జాతికి మోదీ క్షమాపణ చెప్పి తీరాలని అన్నారు. బీజేపీ రాజకీయాలు, అధికారం, ఓట్లు కోసం హిందువులను ఇతర మతాలపై రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందు తుందని విమర్శించారు. రాబోయే తరాలు చిన్న తనం నుంచే హిందూ మతంపై ఆకర్షితుల య్యేందుకు విద్యా వ్యవస్థలో కూడా సిలబస్‌లు మార్చుతున్నారని, దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ పాఠ్యాంశాన్ని చరిత్ర పుస్తకాల్లో లేకుండా తొలగించి ఆర్ఎస్ఎస్ పోరాటాలు చేర్చేలా చూస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి మసీదును తవ్వితే శివలింగాలు బయటపడతాయని తెలంగాణ బీజేపీ అధ్యక్షులు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు బీజేపీ పెద్దల మతోన్మాదానికి అద్దం పడుతున్నాయని, ఇలాంటి మతోన్మాదంతో విర్రవీగుతున్న మోదీ ప్రభుత్వాన్ని 2024లో సాగనంపకపోతే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో కూడా సమూల మార్పులు చేస్తారని రామకృష్ణ హెచ్చరించారు. బీజేపీ ఎనిమిదేళ్ల పాలనలో పేదలు, సామాన్యులకు ఒరిగిందేమీ లేదని, కేవలం కార్పొరేట్‌లకు దేశ సంపద కట్టబెట్టడమే పనిగా పాలన సాగుతోందన్నారు. అన్ని రంగాల్లో కార్పొరేట్ అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ చట్టాల్లో అనేక సవరణలు చేస్తున్నారని తెలిపారు. చివరికి రైతాంగానికి వ్యతిరేకంగా చట్టాలను సవరణ చేశారని, ఏడాదికి పైగా రైతులు పోరాటాలు చేస్తే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని మోదీ మెడలు వంచేందుకు ముమ్మర పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు తప్ప ఎటువంటి అభివృద్ధి జరగడం లేదని, రాష్ట్ర అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గాలికొదిలేశారని విమర్శించారు. ఆ సంక్షేమ పథకాల్లో కూడా ఇలా ఇచ్చి, అధిక ధరతో దానికి రెట్టింపు ప్రజల నుంచి వసూళ్లు చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడి పెట్టేందుకు ఎవరూ కూడా ముందుకు రావడం లేదని అన్నారు. రహదారులు అధ్వానంగా ఉన్నాయని, సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న మాదిరిగా తయారయ్యాయని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం కొత్తగా ఒక్క ఎకరాకైనా నీరందించిందా అని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు పరం చేస్తామన్న కేంద్రంతో జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు పోరాడటం లేదని నిలదీశారు. ప్రత్యేక హోదా విభజన హామీలు, కడప ఉక్కు ఫ్యాక్టరీపై కేంద్రంతో పోరాడకుండా కేవలం అప్పు కోసమే ఆయన దిల్లీ వెళుతున్నారని విమర్శించారు. ఆగస్టులో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర మహాసభలు, అక్టోబర్‌లో విజయవాడలో జరిగే జాతీయ మహాసభల్లో దేశంలోని, రాష్ట్రంలో అనేక ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాలపై చర్చిస్తామని అన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు కార్యాచరణ రూపొందిస్తామని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

అనంతరం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలన్నీ వ్యాపార దృక్పథ పార్టీలేనని తెలిపారు. వాళ్ల పార్టీలకు నిధులు ఇచ్చే కార్పొరేట్‌లకు అనుకూల నిర్ణయాలు తీసుకొని, సామాన్యులను ముంచే పార్టీలే ఉన్నాయని, ఒక్క కమ్యూనిస్టు పార్టీలే ప్రజా సంక్షేమం కోసం నిత్యం ప్రజల పక్షాన పోరాడుతాయని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం సీపీఐ పోరాడుతోందని, ఎన్నో పోరాటాలతో ఎందరికో భూములు పంచిపెట్టిన ఘనత సీపీఐకి ఉందని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగడానికి కూడా పోరాటాల ఫలితమేనని అన్నారు. రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అలాగే రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర లేదని, అనేక సమస్యలతో ప్రజలు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడి పార్టీని బలోపేతం చేయాలని, ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని కోరారు. ఈ సమావేశానికి అధ్యక్షులుగా సీపీఐ నాయకులు చాపర వెంకటరమణ, పట్టా ప్రభావతి, యడ్ల గోపి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సనపల నర్సింహులు, రాష్ట్ర సమితి సభ్యులు చాపర సుందర్‌లాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు బలగ శ్రీరామ్మూర్తి, గురుగుబెల్లి రాజేశ్వర రావు, లండ వెంకటరావు, ఎస్.నారాయణస్వామి, ఎం.యుగంధర్, లక్కోజి శ్రీనివాసరావు, చిక్కాల గోవిందరావు, చీకటి నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బలగ శ్రీరామ్మూర్తి

గురుగుబెల్లి రాజేశ్వరరావు

లండ వెంకటరావు

జిల్లా కార్యదర్శిగా బలగ శ్రీరామ్మూర్తి
సహాయ కార్యదర్శులుగా రాజేశ్వరరావు, వెంకటరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్: సీపీఐ జిల్లా కార్యదర్శిగా బలగ శ్రీరామ్మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ కార్యదర్శులుగా గురుగుబెల్లి రాజేశ్వరరావు, లండ వెంకటరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా సనపల నర్సింహులు, చాపర సుందర్‌లాల్, చాపర వెంకటరమణ, మొజ్జాడ యుగంధర్, ఎస్. నారాయణస్వామి, దోల శంకరరావు, యడ్ల గోపి, ఆహ్వానితులుగా చిక్కాల గోవిందరావు ఎన్నికయ్యారు.

నాగాలాండ్‌లో 30 మంది
సైనికులపై హత్యారోపణలతో చార్జిషీటు

న్యూదిల్లీ: నాగాలాండ్‌లో 30 మంది సైనికులపై చార్జిషీటు దాఖలు అయింది. 2021, డిసెంబరు 4న మోన్ జిల్లాలోని ఓటింగ్ గ్రామస్తులపై 21 పారా ప్రత్యేక దళాలు కాల్పులు జరిపగా 17 మంది చనిపోయారు. గ్రామస్తులను చొరబాటుదారులుగా భావించి కాల్పులు జరిపినట్లు సైన్యం అప్పట్లో పేర్కొంది. అయితే ఇది ఉద్దేశపూరిత చర్య అని అప్పట్లో ఆరోపణలు వినిపించాయి. కాగా, ఈ ఘటనపై విచారణకు నాగాలాండ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సిట్ కోర్టులో సమర్పించిన చార్జిషీటులో ఒక సైన్యాధికారితో పాటు 29 మంది సైనికుల పేర్లు ఉన్నాయి. ఈ ఘటనప్పుడు సైనికులు స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీలు), రూల్స్ ఆఫ్ ఎంగేజ్‌మెంట్‌ను పాటించలేదని సిట్ ఆరోపించింది. బొగ్గు గని కార్మికులు సాయంత్రం పని నుంచి ఇళ్లకు వ్యాన్‌లో వెళుతుండగా మార్గంమధ్యలో సైనికులు వారిని ఉటంకించి కాల్చిచంపారు. అయితే కార్మికులను తీవ్రవాదులుగా పొరపడినట్లు ఆర్మీ దిమాపూర్-3కార్ప్స్ ప్రకటన పేర్కొంది. ఇదిలావుంటే, చార్జిషీట్‌లో పేర్లు ఉన్న సైనికులపై చర్యలకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని నాగాలాండ్ ప్రభుత్వం కోరింది. రాష్ట్ర పోలీసులు ఈ మేరకు లేఖను రక్షణశాఖకు పంపారు. అప్పట్లో ఈ ఘటనకు ప్రతిస్పందనగా సాయుధ దళాల (ప్రత్యేక) అధికారాల చట్టం రద్దునకు డిమాండు రాష్ట్రవ్యాప్తంగా వినిపించింది. ఎవరినైనా వారెంటు లేకుండా అరెస్టు చేసే అధికారాన్ని ఈ చట్టం సైనికులకు ఇస్తుంది. వారు ఎవరినైనా కాల్చితే విచారణ ఉండదు. నాగాలాండ్ ప్రభుత్వ సిట్‌తో పాటు ఆర్మీలో భాగమైన వేరొక బృందం కూడా విచారణ జరుపుతోంది. మేజర్ జనరల్ సారథ్యంలో ఆర్మీ విచారణ జరుగుతోంది. ఆయన ఓటింగ్ గ్రామాన్ని సందర్శించి ఎలాంటి సందర్భంలో ఘటన చోటుచేసుకున్నదన్నది సమీక్షించారు.

యువతను దగా చేసిన మోదీ
ప్రొఫెసర్ అనిల్ రజింవాలే విమర్శ

విశాలాంధ్ర-హైదరాబాద్: నిరాశావాదులు, నిస్సహాయకులుగా ఉన్న విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఐ జాతీయ సమితి సభ్యులు, ప్రొఫెసర్ అనిల్ రజింవాలే విమర్శించారు. ఇక్కడి మక్దూం భవన్‌లో శనివారం సీపీఐ కేంద్ర పార్టీ పాఠశాల ఆధ్వర్యంలో యువజనుల కోసం ఏడు రోజుల విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల నుంచి యువజనులు హాజరైన ఈ శిక్షణ తరగతులను ప్రొఫెసర్ అనిల్ రజింవాలే ప్రారంభించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని నమ్మి మోసపోయారన్నారు. విద్యావంతులైన యువకులు ఉద్యోగం, మెరుగైన జీవితం ఆశించి బీజేపీకి ఓటు వేశారని, ఎనిమిదేళ్ళ పాలనలో మోదీ ఎనమిది వేల ఉద్యోగావకాశాలను కూడా కల్పించకుండా నిరుద్యోగ యువతను మోసం చేశాడని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మోసాల వల్ల నేడు విద్యావంతులైన యువకులు ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వాల వినాశకరమైన విధానాలు యువత భవిష త్తును దెబ్బతీస్తున్నాయని, ప్రశ్నిస్తే యువత గొంతును అణిచివేస్తున్నాయని అయన ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయవాదం, దేశభక్తి పేరుతో బీజేపీ యువతను రెచ్చగొట్టి మత విద్వేషాలను సృష్టించి వారి భవిషత్తును నాశనం చేస్తోందన్నారు. భయంకరమైన బీజేపీ ఉచ్చులో దేశ యువత చిక్కుకోవద్దని అయన సూచించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం నేడు ప్రమాదంలో ఉన్నాయని, శాంతి యుత దేశంగా భారతదేశ ప్రతిష్ఠను నరేంద్ర మోదీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని, దేశ ప్రతిష్ఠ, భవిష్యత్తును కాపాడుకునే బాధ్యత యువతదేనని రజింవాలే అన్నారు.

కాన్పూర్ హింస కేసులో
నిందితుడి బంధువు భవనం కూల్చివేత

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈనెల 3న చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు కారణమైన ప్రధాన నిందితుడు జాఫర్ హయత్ హష్మీ సన్నిహితుడు మహమ్మద్ ఇస్తియాఖ్‌కు చెందిన భవనాన్ని అధికారులు కూల్చి వేశారు. మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేతల నూపుర్ శర్మపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 3న కొందరు వ్యక్తులు చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. ఈ హింసాత్మక ఘటనలకు కారణహైణ ప్రధాన నిందితుడైన జాఫర్ హయత్ సన్నిహితుడైన మహమ్మద్ ఇస్తియాఖ్‌కు చెందిన నూతన భవంతిని కాన్పూర్ డెవలప్‌మెంట్ అథారిటీ (కేడీఏ) అధికారులు కూల్చి వేసినట్టు నగర సంయుక్త పోలీసు కమిషనర్ ఆనంద్ ప్రకాశ్ తివారి తెలిపారు. నగరంలోని స్వరూప్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఈ భవనాన్ని నిబంధనలకు అనుగుణంగానే కూల్చి వేసినట్టు తెలిపారు. జూన్ 3 వ తేదీన చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలకు జాఫర్ హయత్ హష్మీ ఆర్థికంగా సహకరించినట్టు ఆధారాలున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఆయన్ను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో ఇతర నిందితులు జావేద్ అహ్మద్ ఖాన్, మహ్మద్ రహీల్, సుఫియాన్‌లతో పాటు జాఫర్ హయత్ హష్మీని 72 గంటపాటు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ స్థానిక కోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసిన క్రమంలో వారిని శనివారం అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితులు మంగళవారం వరకూ తమ కస్టడీలోనే ఉంటారని పేర్కొన్నారు.

కోవిడ్‌పై ఆందోళన వద్దు

- కొత్త వేరియంట్లు ప్రమాదకరం కాదు
- కేసుల పెంపుదల మెట్రో నగరాలకే పరిమితం
- టీకాలు తీసుకోండి - మాస్కులు ధరించండి : ఆరోగ్య నిపుణులు

న్యూదిల్లీ: కోవిడ్ కొత్త వేరియంట్లు మునుపటి వాటంత ప్రమాదకరమేమీ కాదని, కేసులు పెరిగినా ఆందోళన అక్కర్లేదని, ఇన్ఫెక్షన్లు మెట్రోనగరాలకే పరిమితమంగా ఉన్నా యని ఆరోగ్య నిపుణులు శనివారం అన్నారు. కోవిడ్ అంతం కాలేదన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలని, టీకాలు తీసుకోవాలని, మాస్కులను జీవితంలో భాగం చేసుకోవాలని, అన్ని జాగ్రత్తలు పాటించాలని అప్పట్లో వైరస్‌ను కట్టడి చేయగలమని ప్రజలకు హితవు పలికారు. కేరళలోని ఏడు జిల్లాలతో పాటు మిజోరంలో ఐదు జిల్లాల్లో వారంతపు కోవిడ్ పాజిటివిటీ రేటు 10శాతానికిపైగా ఉంటే కేరళలోని ఏడుతో సహా మహారాష్ట్ర, మిజోరంలో చెరో నాలుగు ర్యాస్టాల్లో అది 5-10శాతానికి మధ్య ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు ఆందోళన కలిగించే కొత్త వైరస్‌లను గుర్తించ లేదు. ప్రస్తుతానికి భారత్‌లో బీఏ.4, బీఏ.5 ఉన్నాయి. బీఏ.2 కూడా ప్రబలుతోంది. వేసవి సెలవులు కావడం జాతీయంగానే కాకుండా అంతర్జాతీయంగా ప్రయాణ ఆంక్షలు సడలించడంతో రాకపోకలు పెరిగాయి. ఆర్థిక కార్యకలా పాలు పుంజుకున్నాయి. ఈ కారణంగా ముప్పు ఎక్కువగా ఉన్న వర్గాల్లో వైరస్ ప్రభావం కనిపిస్తోంది అని ఇమ్యూనైజేషన్ జాతీయ సాంకేతిక సలహా సంఘం (ఎన్‌టీ ఏజీఐ) చైర్మన్ డాక్టర్ ఎన్‌కే అరోరా అన్నారు. ఇన్ఫెక్షన్ మెట్రోనగరాలు, ఎక్కువ జనాభా గల పెద్ద నగరాలకే పరిమితంగా ఉండటం గమనార్హమన్నారు. ఇన్ఫెక్షన్ బారిన పడుతున్న వారిలో చాలా మంది టీకాలు పొందిన వారే ఉన్నారని, వారికి జలుబు, స్వల్ప ఇంఫుయెంజా తరహా లక్ష ణాలు ఉంటున్నాయని చెప్పారు. కోవిడ్‌తో సహ జీవనం చేస్తున్నామని మరువరాదన్నారు. కోవిడ్ సోకకుండా అప్రమత్తంగా ఉండాలని, తగు జాగ్రత్తలను పాటించాలని, మాస్కులు జీవితంలో భాగమైపోవాలని, రద్దీ ప్రాంతాలను నివారించాలని సూచిం చారు. కేసులు పెరిగినాగానీ ఆసుపత్రుల్లో చేరికలు పెరగలేదని, మరణాలు సంభవిం చడం లేదని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణదీప్ గులేరియా అన్నారు. ప్రికాషన్ డోసుకు అర్హులైన వారు దానిని తీసుకోవడం లేదని, అందుకు ముప్పు పొంచివున్న వారి సంఖ్య పెరిగిందని అన్నారు. రెండు టీకాలు తీసుకున్న ఆరు నెలల తర్వాత రోగనిరోధక శక్తి తగ్గిపోతుందని అందుకే బూస్టర్ డోసు అవసరమని ఐసీఎంఆర్‌తో పాటు అంతర్జా తీయ పరిశోధక సంస్థల్లో నిర్వహించిన అధ్యయనాల్లో వెల్లడి అయిందన్నారు.

ఫ్యాషన్ డిజైనర్ ప్రత్యూష ఆత్మహత్య

హైదరాబాద్: ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ గరిమెళ్ల ప్రత్యూష ఆత్మహత్య చేసుకుంది. బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ప్రత్యూష శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ప్రత్యూష మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రత్యూష గదిలో కార్బన్ మోనాక్సైడ్ బాటిల్ లభ్యమైంది. దీంతో ఆమె ఆ వాయువు పీల్చి మృతి చెందినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతరం, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఆమె ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కాగా, ఫ్యాషన్ డిజైనర్‌గా ప్రత్యూష మంచి గుర్తింపు పొందారు. బాలీవుడ్, టాలీవుడ్‌లో ప్రముఖ హీరోయిన్లకు ప్రత్యూష డ్రెస్‌లు డిజైన్ చేశారు. దేశంలోని 30 మంది ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్స్‌లో ప్రత్యూష ఒకరుగా గుర్తింపు ఉంది. రిటైర్డ్ ఐఆర్ఎస్ కృష్ణారావు కుమార్తె ప్రత్యూష.

సూసైడ్ నోట్ రాసిన ప్రత్యూష

ప్రత్యూష ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్ రాసింది. తల్లిదండ్రులకు భారం కాలేనని, క్షమించండి అంటూ సూసైడ్ నోట్‌లో పేర్కొంది. తాను కోరుకున్న జీవితం ఇది కాదని లేఖలో పేర్కొంది. కాగా, శుక్రవారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని సొంతింటి నుంచి బోటిక్‌కు వచ్చిన ప్రత్యూష.. అక్కడకు కేవలం ఒక బ్యాగ్‌తోనే వెళ్లింది. తనను ఎవరూ డిస్టర్బ్ చేయవద్దని లోపలికి వెళ్లేముందు వాచ్‌మేన్‌కు ప్రత్యూష చెప్పింది. ఎంతసేపటికీ ఆమె బయటకు రాకపోవడంతో వాచ్‌మేన్ వెళ్లి చూడగా.. ఆమె కిందపడిపోయి ఉండటంతో అతను పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసులు.. ప్రత్యూష మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

విశాలాంధ్రకు 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
స్వయంభూ
శ్రీ వీరాంజనేయ స్వామివారి దేవస్థానం
దేవాదాయ ధర్మాదాయ శాఖ
మేడూరు గ్రామం, గంపలగూడెం మండలం, ఎన్.టి.ఆర్.జిల్లా



శ్రీ స్వామివారికి ప్రతి శని, మంగళవారములు ఉదయం 5గంటలకు పంచామృత అభిషేకములు విశిష్టముగా జరుగును. ప్రతి సంవత్సరము డిసెంబరు నెలలో 7 రోజులు సప్తాహ కార్యక్రమములు, అన్నదానం జరుగును. మరియు శ్రీరామనవమి కళ్యాణము, హనుమత్ జయంతికి 3 రోజులు 108 బిందెల జలాభిషేకము, మూడు రోజులు విశిష్ట పూజలు, అన్నదానం మరియు 3వరోజు స్వామివారి గ్రామోత్సవము అంగరంగ వైభవముగా జరుగును.

ముత్యాల రామకృష్ణ, చైర్మన్ మరియు బోర్డు సభ్యులు
జన్ను వెంకటేశ్వరరావు, మేనేజరు అర్చక బృందం మరియు సిబ్బంది

విశాలాంధ్రకు 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
దేవాదాయ, ధర్మాదాయ శాఖ
శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానము

నెమలి గ్రామము, గంపలగూడెం మం॥, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 08673-288633, 288808
శాశ్వత సేవా పథకములు
శ్రీ స్వామివారికి ప్రతి సోమ, శుక్రవారము, శుద్ధ ఏకాదశి మరియు పునర్వసు నక్షత్రమురోజులలో ఉదయం 6-00గం॥లకు విశేష అభిషేకము జరుగును. అభిషేకము చేయించదలచిన భక్తులు పై రోజులలో రోజు ఒక్కింటికి రూ.3000.00లు చొప్పున అదనముగా పోస్టేజి నిమిత్తము రూ.10.00లు కలిపి మనియార్డరు ద్వారాగాని, డిమాండు డ్రాఫ్టుద్వారా గాని చెల్లించవలెను.

శ్రీస్వామివారి దేవస్థానము సమయములు, పూజా వివరములు
ఉదయం : 6-00గం॥లు నుండి మధ్యాహ్నం 1-00గం॥ వరకు
మధ్యాహ్నం : 3.00గం॥లు నుండి రాత్రి 8-00గం॥లు వరకు
సోమవారములలో
ఉదయం: 5-00గం॥లు నుండి మధ్యాహ్నం 1-00గం॥లు వరకు
మధ్యాహ్నం: 3-00గం॥లు నుండి రాత్రి : 9-00గం॥లు వరకు
శుక్రవారములలో
ఉదయం: 5-00గం॥లు నుండి మధ్యాహ్నం 1-00గం॥ వరకు
మధ్యాహ్నం : 3-00గం॥లు నుండి రాత్రి 9-00గం॥లు వరకు
ప్రతి సోమ, శుక్రవారములలో శుద్ధ ఏకాదశి మరియు పునర్వసు నక్షత్రములలో ఉదయం 6-00గం॥లకు అభిషేకము
శ్రీస్వామివారి అర్చనా కాలములు
ప్రతిరోజు ఉదయం 7-00గం॥లు నుండి 7-30గం॥లు వరకు
ఉదయం 11-00గం॥లు నుండి 11-30గం॥లు వరకు
సాయంత్రం 5-30గం॥లు నుండి 6-00 గం॥లు వరకు

శ్రీమతి కావూరి శశిరేఖ ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్
యన్.వి. సాంబశివరావు కార్యనిర్వహణాధికారి మరియు సహాయ కమిషనరు
మరియు దేవస్థాన కమిటీ సభ్యులు

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.